తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శనివారం
04, జూలై, 2026

## కల్వకుర్తిలో ప్రధాన రహదారులు రోడ్ల.. పార్కింగా..?

- పోస్ట్ ఆఫీస్ గల్లి,పోస్ట్ ఆఫీస్ ముందు బైకులు
- పార్కింగ్,ప్రజలకు తీవ్ర ప్రజలు
- కల్వకుర్తిలో ప్రజల అవస్థలు
- ప్రధాన రహదారులపై వాహనాల నిలుపుదలతో ట్రాఫిక్‌కు ఆటంకం
- రద్దీ ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ పార్కింగ్‌తో పెరుగుతున్న ఇబ్బందులు



**కల్వకుర్తి,జూలై 3,(జనంసాక్షి):** కల్వకుర్తి పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ ప్రజలకు కొత్త సవాళ్లను తెస్తోంది.బస్టాండ్ దగ్గర టీ కొట్టు ఉండటంతో టీ తాగడానికి వచ్చేవారు బైక్లను రోడ్లపైనే పార్కు చేస్తూ ప్రజలని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు,బస్టాండ్ ప్రాంత ప్రధాన రహదారిని ఆక్రమించి ఎక్కడపడితే అక్కడ అడ్డగోలుగా వాహనాలు నిలుపుతూ ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారు. మరి ప్రధానంగా ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర బైకులు,ఇతర వాహనాలను పార్కు చేస్తుండటంతో మరియు చిరు వ్యాపారులు రోడ్లన్నీ ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో పాదాచారులకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుస్తోంది.ఈ సమస్య తీరాలంటే బస్టాండ్ దగ్గర ఒక కానిస్టేబుల్ ని ఏర్పాటు చేసి సమస్య తీవ్రతరం కాకుండా చూడాలని ప్రజలు ఉన్నత అధికారులను కోరుకుంటున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు,వ్యాపార సముదాయాలు,మార్కెట్ ప్రాంతాలు, రద్దీ కూడళ్ల వద్ద రోడ్లపైనే వాహనాలు నిలిపివేయడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో కొన్నిచోట్ల రహదారులు పార్కింగ్ స్థలాలుగా మారినట్లు కనిపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.కల్వకుర్తి పట్టణంలోని నాగర్‌కర్నూల్ చౌరస్తా, బస్టాండ్ పరిసరాలు,మహబూబ్‌నగర్ చౌరస్తా, హైదరాబాద్ చౌరస్తా,శివాజీ చౌక్, కూరగాయల మార్కెట్ ప్రాంతం, వైన్స్ దుకాణాల సమీపం, బార్ అండ్ రెస్టారెంట్‌ల వద్ద, ఖాదర్ హోటల్ పరిసరాలు, పోస్టాఫీస్ ముందు, పోస్టాఫీస్ పక్కన, తిరుపతి హైవే బ్రిడ్జి సమీపంలో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపివేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు, కార్లు రహదారులపైనే గంటల తరబడి నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ మందగిస్తున్నట్లు కనిపిస్తోంది.కల్వకుర్తి పట్టణంలోని ప్రధాన వ్యాపార కేంద్రాలకు వచ్చే వాహనదారులు తమ వాహనాలను రహదారి పక్కనే నిలిపివేయడంతో రోడ్ల వెడల్పు మరింత తగ్గిపోతోంది. ఫలితంగా ఒకేసారి రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లాల్సి వచ్చినప్పుడు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ట్రాన్స్పోర్ట్ వాహనాలు సైతం రోడ్లపై ఇక్కడ పడితే అక్కడ ఆపి లారీలోని సామాగ్రిని ఇతర చాప దగ్గరికి చేస్తున్నడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు నా విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉదయం పాఠశాలల సమయం, సాయంత్రం వ్యాపార కార్యకలాపాలు అధికంగా ఉండే వేళల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది.పాదచారులు,విద్యార్థులు,మహిళలు, వృద్ధులు రహదారులపై ప్రయాణించే సమయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల వాహనాల నిలుపుదల కారణంగా నడిచే వారికి కూడా సరిపడా స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మార్కెట్ ప్రాంతాలకు వచ్చే కొనుగోలుదారులు సైతం ట్రాఫిక్ రద్దీతో అసౌకర్యానికి గురవుతున్నారు.పట్టణ విస్తరణతో పాటు వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండగా,పార్కింగ్ అవసరాలు కూడా పెరుగుతున్నాయి.అయితే ప్రధాన రహదారులపైనే వాహనాలను నిలిపివేయడం వల్ల రోజువారీ రాకపోకలపై ప్రభావం పడుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.రద్దీ ప్రాంతాల్లో వాహనాలను క్రమబద్ధంగా నిలిపివేయడం, రహదారులను ట్రాఫిక్‌కు అనుకూలంగా ఉంచడం ద్వారా ప్రజలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉందని వారు సూచిస్తున్నారు.ప్రస్తుతం కల్వకుర్తి పట్టణంలో "రోడ్డా.. పార్కింగా..?" అనే ప్రశ్న ప్రజల నోట వినిపిస్తోంది. రోజువారీ రాకపోకల్లో ఎదురవుతున్న ఈ పరిస్థితి స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ప్రధాన కూడళ్లలో, వ్యాపార కేంద్రాల వద్ద, మార్కెట్ ప్రాంతాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్య కల్వకుర్తి పట్టణ ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది.

## నేడు ఉర్కొండలో సీఎం పర్యటన

- అభివృద్ధి పథకాల ప్రకటనకు ఛాన్స్
- జడ్పీటీసీ ఎన్నికల్లో మద్దతుదారులతో మాటామంతి
- సీఎం పర్యటనతో ఉర్కొండకు మహర్దశ,పథకాల ప్రకటనకు ఛాన్స్
- సీఎం పర్యటన నేపథ్యంలో భారీగా బందోబస్తు



**ఉర్కొండ, జూలై 03, (జనంసాక్షి);** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ఉర్కొండ మండలంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మండలానికి సంబంధించి పలు అభివృద్ధి పథకాలను ప్రకటించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. సీఎం పర్యటనతో ఉర్కొండకు మహర్దశ పట్టనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నాడు జరిగిన జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా పార్టీకి మద్దతు తెలిపిన వివిధ పార్టీల నాయకులు, మద్దతుదారులు, కార్యకర్తలతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడనున్నారు. వారి సమస్యలు తెలుసుకొని, నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించనున్నట్లు సమాచారం. ఉర్కొండ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి మిడ్జిల్ మండలంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ సభలో కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ నేతృత్వంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఉర్కొండ, మిడ్జిల్ మండలాల్లో పోలీసు శాఖ జిల్లా ఎస్పీ సంగ్రామ్ జి పాటిల్ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాదారం మాజీ సర్పంచ్ ధ్యాప నిఖిల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయూబ్ పాషా, మండల తాజా ప్రజా ప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులు, తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారు.

## కల్హేర్ పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభం

- ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలు అందుబాటులోకి ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి
- మాదకద్రవ్యాలపై కఠిన చర్యలు
- ఎస్పీ పరితోష్ పంకజ్





**సంగారెడ్డి బ్యూరో, జూలై 3 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కల్హేర్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి శుక్రవారం. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ... జిల్లాల పునర్విభజన అనంతరం ఏర్పాటైన కల్హేర్ పోలీస్ స్టేషన్ ఇప్పటివరకు తాత్కాలిక భవనంలో కొనసాగిందని, ప్రస్తుతం అన్ని సౌకర్యాలతో కూడిన నూతన భవనంలో సేవలు ప్రారంభించడం సంతోషకరమని తెలిపారు. ఈ భవనం ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

కల్హేర్ మండల ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని చెప్పారు. యువత మాదకద్రవ్యాలు వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించిన ఎస్పీ, జిల్లాలో గంజాయి సాగు, మాదకద్రవ్యాల విక్రయాలు, అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఎక్కడైనా గంజాయి సాగు లేదా డ్రగ్స్ అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే జిల్లా ఎస్-న్యాబ్ హెల్ప్‌లైన్ 8712656777కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.


అనంతరం ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో మౌలిక సదుపాయాలు కీలకమని అన్నారు. నూతన పోలీస్ స్టేషన్ భవనం పోలీసు సిబ్బంది విధి నిర్వహణకు తోడ్పడటంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, కంగ్టి సీఐ వెంకట్ రెడ్డి, కల్హేర్ ఎస్సై రవిగౌడ్, సిర్గాపూర్ ఎస్సై జి.మహేష్, కంగ్టి ఎస్సై దుర్గారెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కొత్త భవనం సిద్ధం... పాత భవనంలోనే వైద్యం!

- శిథిలావస్థలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.. ప్రమాదంలో రోగులు
- ప్రారంభానికి నోచుకోని నూతన భవనం.. ప్రజల్లో ఆగ్రహం





**పుల్కల్, జూలై 3 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఒకవైపు అత్యాధునిక సౌకర్యాలతో నూతన భవనం నిర్మాణం పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉండగా, మరోవైపు శిథిలావస్థకు చేరిన పాత భవనంలోనే వైద్య సేవలు కొనసాగుతున్నాయి. దీంతో రోగులు, వైద్య సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.పాత భవనం పైకప్పు పలు చోట్ల పగుళ్లు ఏర్పడి పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షం కురిస్తే గదుల్లోకి నీరు చేరడంతో ఓపీ సేవలు, చికిత్సలు అంతరాయం ఎదుర్కొంటున్నాయి. గోడలు బీటలు వారడం, తలుపులు, కిటికీలు దెబ్బతినడం, విద్యుత్ సదుపాయాలు సరిగా లేకపోవడంతో ఆస్పత్రి వాతావరణం అధ్వానంగా మారింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు అధికంగా వచ్చే ఈ ఆస్పత్రిలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం నెలకొంది. ఇదిలా ఉండగా, ప్రభుత్వ నిధులతో నిర్మించిన నూతన ఆస్పత్రి భవనం అన్ని హంగులతో సిద్ధంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు ప్రారంభించకపోవడం విమర్శలకు తావిస్తోంది. భవనం సిద్ధమైనప్పటికీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడానికి గల కారణాలపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని స్థానికులు అంటున్నారు.పుల్కల్ మండలంతో పాటు పరిసర గ్రామాల వేలాది మంది ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపైనే ఆధారపడుతున్నారు. కొత్త భవనం ఖాళీగా ఉండగా, శిథిలమైన పాత భవనంలో వైద్య సేవలు కొనసాగించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు.

### తక్షణమే ప్రారంభించాలి...

నూతన భవనాన్ని వెంటనే ప్రారంభించి అన్ని వైద్య సేవలను అక్కడికి తరలించాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు, రోగులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే బదులు ముందస్తు చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలను కాపాడాలని వారు ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పద్మ పురస్కాలకు అర్హులైన వ్యక్తుల నుండి నామినేషన్ల ఆహ్వానం

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల నడిగడ్డ, జులై 3(జనంసాక్షి);** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రదానం వేసే పద్మ అవార్డులు-2027 పద్మవిభూషణ్, పద్మ భూషణ్,పద్మ శ్రీ అర్హులైన వారి నుండి నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు.

దేశానికి, సమాజానికి విశిష్ట సేవలు అందించిన అసాధారణ ప్రతిభావంతులను పద్మ అవార్డులకు సిఫారసు చేయాలని భారత ప్రభుత్వం కోరుతున్నట్లు తెలిపారు.గుర్తింపు పొందని ప్రతిభావంతులు,గ్రామీణ,గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వారు, మహిళా సాధికారత, బాలల సంక్షేమం, సామాజిక సేవ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ,సైన్స్, ఇంజినీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీస్, వాణిజ్యం, పరిశ్రమలు మొదలైన రంగాల్లో విశిష్ట సేవలు అందించి విజయాలు సాధించిన వారికి ఈ అవార్డులు అందజేయనున్నట్లు వెల్లడించారు. 2027 సంవత్సరానికి ఇచ్చే ఈ పద్మ అవార్డుల కోసం నామినేషన్లు, సిఫార్సులను రాష్ట్రపతి పురస్కార్ పోర్టల్ https://awards.gov.in ద్వారా స్వీకరించబడతాయని వెల్లడించారు. నామినేషన్లను 15 జూలై, 2026 లోగా పైన పేర్కొన్న పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ఫార్మాట్‌లో, పూర్తి వివరాలతో పాటు విశిష్ట సేవలు,సామాజిక సేవలు వివరణాత్మక కథనం రూపంలో పంపించాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో నామినేషన్లు పంపడానికి అవసరమైన సూచనలు https://awards.gov.in పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని, అలాగే నియమనిబంధనలు పద్మ అవార్డుల వెబ్‌సైట్: https://padmaawards.gov.inలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన అర్హులైన వ్యక్తులు లేదా వారి పేర్లను సిఫారసు చేయదలచిన వారు, పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలను 2026 జూలై 15లోగా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయానికి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.



# పెద్దమ్మ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**శ్రీరంగాపూర్, జూలై 3 (జనంసాక్షి):** శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పెద్దమ్మ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి హాజరై అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జరుపుకునే సంప్రదాయ పండుగలకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. పండుగలు ప్రజలను ఒకచోట చేర్చి గ్రామాల్లో ఐక్యత, సోదరభావం పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలంతా పరస్పర సహకారంతో కలిసిమెలిసి ఉండాలని, పండుగలను ఆనందోత్సాహాలతో నిర్వహిస్తూ సంప్రదాయాలను భావితరాలకు అందించాలని సూచించారు.కార్యక్రమంలో శ్రీరంగపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ గుడి నిర్మాణానికి మూడు లక్షల విరాళం అందజేసిన ఎమ్మెల్యే తుడిమేగారెడ్డి



**శ్రీరంగాపూర్, జూలై 3 (జనంసాక్షి):** శ్రీరంగాపూర్ మండల పరిధిలోని తాటిపాముల గ్రామంలో పెద్దమ్మ గుడి నిర్మాణం పనుల కోసం వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి మూడు లక్షలు ఆర్థిక సహాయాన్ని విరాళాన్ని అందజేశారు ఈ సందర్భంగా పెద్దమ్మ గుడి పునర్ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ఆలయ కమిటీకి మూడు లక్షల రూపాయలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేలకు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తుల సౌకర్యార్థము ఎప్పుడు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తుడిమేగారెడ్డి తెలిపారు.గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణము పెంపొందించడంలో దేవాలయాల పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తాటిపాముల గ్రామ సర్పంచ్ శిరీష మధు మరియు శ్రీరంగాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విష్ణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాములు యాదవ్,కుర్మయ్య, రాజా గౌడ్, జెసిపి ఎల్ల స్వామి, కుమ్మరి గోవిందు,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది.

# మిడ్జిల్ మహాసభను చారిత్రాత్మక విజయంగా నిలపాలి

**- ప్రజలు,కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావాలి: ఎమ్మెల్యే కసిరెడ్డి**

**- సీఎం రాజకీయ ప్రస్థానానికి 20 ఏళ్లు పూర్తి సందర్భంగా మహా విజయోత్సవ సభ**

**కల్వకుర్తి,జూలై 3,(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిఎనుముల రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జూలై 4న మిడ్జిల్‌లో నిర్వహించనున్న మహా విజయోత్సవ బహిరంగ సభను చారిత్రాత్మక విజయంగా నిలపాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు.ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలిసారిగా మిడ్జిల్‌కు విచ్చేస్తున్న నేపథ్యంలో ఈ సభకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి నాయకత్వానికి మద్దతుగా నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేయడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు.జూలై 4న మధ్యాహ్నం 2 గంటలకు మిడ్జిల్‌లో జరగనున్న బహిరంగ సభకు కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజలు, రైతులు, మహిళలు, యువజనులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ జీవితంలో రెండు దశాబ్దాల పూర్తి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ మహాసభ ప్రజాస్వామ్య విలువలకు, ప్రజా సేవకు అంకితమైన నాయకత్వానికి నిదర్శనంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించే వేదికగా కూడా ఈ సభ నిలుస్తుందన్నారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతం, తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. మిడ్జిల్ సభా ప్రాంగణం జనసంద్రంగా మారేలా ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి సభ విజయవంతానికి తోడ్పడాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభ కల్వకుర్తి నియోజకవర్గ రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని, ప్రజల అపూర్వ స్పందనతో సభ విజయవంతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# పరీక్ష కిట్లను అందుబాటులో ఉంచుకోవాలి

**- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె .కృష్ణ**





**నాగర్ కర్నూల్, జూలై 3 (జనంసాక్షి):** వర్షాకాలంలో అంటు వ్యాధులు ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్ తదితర జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జ్వర పరీక్షల కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా విద్యా మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ తెలిపారు. శుక్రవారం నాగర్ కర్నూల్ పాత కలెక్టరేట్ కార్యాలయం కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్స్ కు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ కే కృష్ణ మాట్లాడుతూ, ప్రతిరోజు అనుమానిత రోగుల నుంచి సేకరించిన రక్త నమోనాలను తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్‌కు తప్పకుండా పంపాలని ల్యాబ్ టెక్నీషియన్‌కు సూచించారు. ముఖ్యంగా గర్భవతులకు శ్యాలిస్ పద్ధతిలోనే హిమోగ్లోబిన్ (రక్తహీనత కొరకు) పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రతిరోజు విధులలో సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజశేఖర్, ఉప జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాల చారి, ల్యాబ్ టెక్నీషియన్ కళ్యాణ్, కృష్ణారావు, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్స్ పాల్గొన్నారు.

# కలెక్టర్ దంపతులకు కూతురు

**- శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం**

**గద్వాల నడిగడ్డ, జులై 3 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ రెండోసారి తండ్రి అయ్యారు. కలెక్టర్ దంపతులకు మొదటిసారి కుమారుడు జన్మించగా, గురువారం కూతురు పుట్టారు. ఈ శుభవార్తను పురస్కరించుకొని పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం శుక్రవారం కలెక్టర్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. తమ కుమార్తెను ఆశీర్వదిస్తూ శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కలెక్టర్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు



**అమరచింత, జులై 3 (జనంసాక్షి):** పేదల సొంతింటి కలను సహకారం చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు అని మక్తల్ శాసనసభ్యులు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గారి సతీమణి వాకిటి లలిత గారు అన్నారు. శుక్రవారం నాగల్ కడుమూర్‌లో కళ్యాణ్ రామ్, సహస్ర, పోతుల వెంకటన్న, కుమారి, నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశానికి హాజరై ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నాగల్ కడుమూరు గ్రామ అధ్యక్షుడు జగన్ రెడ్డి , గ్రామ సర్పంచ్ శివ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, అమరచింత కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎస్ఎం అరుణ్ కుమార్ , మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్యాం కుమార్, కమలాకర్ గౌడ్, నందిమల్ల గ్రామ సర్పంచ్ రాజేందర్ రెడ్డి ,ఎస్టి సెల్ అధ్యక్షులు హనుమంతు నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి, నాయకులు జింక రవి యాదవ్, వీరేష్ గౌడ్, నాగల కడుమూరు పదో వార్డు మెంబర్ దామోదర్, సురేందర్ రెడ్డి, నాగేష్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

## కాల్వ పూడిక తీత పనులను ప్రారంభించిన వాకిటి శేషగిరి



**మక్తల్, జూలై 03 (జనంసాక్షి):** మక్తల్ మున్సిపాలిటీలోని నాలుగో వార్డ్‌లో డోశీగుల ఆంజనేయస్వామి దేవాలయం ముందు ఉన్న మురుగు నీటి కాలువలో మట్టి పిచ్చి మొక్కలుతో నిండి చిన్నపాటి వర్షానికి కాలువలోని మురుగు నీరు పంట పొలాల్లోకి వేళ్ళి ఆలయం ముందు మురుగు నీరు నిలిచిపోవడంతో ఆలయానికి వచ్చే భక్తులకు పొలాలకు వెళ్లే రైతులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి సోదరుడు మక్తల్ మాజీ ఉపసర్పంచ్ వాకిటి శేషగిరి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఇటాచి సహాయంతో కాలువ పూడికతీత పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 4 వ వార్డ్ కౌన్సిలర్ పికే నరసింహ, 5 వార్డ్ కౌన్సిలర్ పెయింటర్ వెంకటేష్, ఆయకట్టు మాజీ ప్రెసిడెంట్ మామిళ్ళ కిష్టప్ప, మాజీ కౌన్సిలర్లు నిప్పురవ్వ, తిరుపతి వెంకటేష్, కత్తిరి నాగరాజ్, రాజేందర్, తిరుపతి నర్సింలు, లింగం, ఈసరి అంజి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను విద్యా రంగంలో బలోపేతం చేయాలి : సి.పి.ఎం

**- బి.వెంకటేష్ సి.పి.ఎం. జిల్లా కమిటీ సభ్యులు**




**అమరచింత, జూలై 3 (జనంసాక్షి):** శుక్రవారం మండలంలోని పాము రెడ్డి పల్లి గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలను సందర్శించి సర్వే నిర్వహించడం జరిగింది. విద్యార్థులు ఫస్ట్ క్లాస్ నుండి 5వ తరగతి వరకు చదువుతున్నారు ఇక్కడ విద్యార్థులకు ఒక టీచర్ పోస్టు ఖాళీగా ఉంది అని తెలిసింది ఆ టీచర్ పోస్టు వెంటనే భర్తీ చేయాలి. సిపిఎం జిల్లా నాయకులు వెంకటేష్ తెలిపారు. అదేవిధంగా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం పథకం కి సంబంధించిన మెనూ పెంచాలి. ప్రభుత్వ స్కూల్లో చదువుతున్న విద్యార్థులకు కనీసం మౌలిక వసతులు కల్పించాలని ఫర్నిచర్ గదులకు కిటికీలకు డోర్స్ వెంటిలేటర్స్ మరియు ఫ్యాన్స్ ఉండాలి. మంచినీటి సమస్య ఉంది. అధికారులు ప్రభుత్వ స్కూల్ ల పైన దృష్టి పెట్టి పేద విద్యార్థులకు ఎలాంటి ఆటంకం కాకుండా ప్రభుత్వ పాఠశాలలో విద్యా వ్యవస్థను కాపాడాలని డిమాండ్ చేశారు. ఐదవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు పెంచాలని కోరారు. ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టి పెట్టి ప్రభుత్వస్కూల్స్ గ్రామాలలో ప్రజలకు చైతన్యం తీసుకొచ్చి విద్యావ్యవస్థను కాపాడి ప్రభుత్వ స్కూల్స్ మూతపడకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు శంకర్ గ్రామ కార్యదర్శి మోహన్ రాజు వెంకటేష్ అశోక్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను కనీస వసతులు కల్పించాలి



**అమరచింత, జూలై 3(జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలలను కనీస వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి వెంకటేష్ డిమాండ్ చేశారు, ఈ సందర్భంగా శుక్రవారం పామ్ రెడ్డి రెడ్డి పల్లె గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు, పాఠశాలలో విద్యార్థులకు ఒక టీచర్ పోస్టు ఖాళీగా ఉంది,వెంటనే భర్తీ చేయాలి అని అన్నారు, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకం సంబంధించి మెనూ పెంచాలి అని అన్నారు, పాఠశాలలో కనీస వసతులు ఫర్నిచర్ గదులకు డోర్స్ మరియు ఫ్యాన్స్ ఉండాలి మంచినీటి సమస్య పరిష్కరించాలి అని అన్నారు. పేద విద్యార్థులకు ఎలాంటి ఆటగా కాకుండా ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడాలని డిమాండ్ చేశారు, ఐదవ తరగతి నుంచి ఏడో తరగతి వరకు పాఠశాల ను పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు శంకర్, గ్రామ కార్యదర్శి కార్యదర్శి మోహన్, రాజు, వెంకటేష్ అశోక్, నాగరాజు పాల్గొన్నారు,

## మాట నిలబెట్టుకున్న సర్పంచ్

**- ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రూ.34 వేల విరాళం**
**- ఐదు నెలల జీతాన్ని చెక్కు రూపంలో అందజేసిన డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి**




**మక్తల్, జూలై 03 (జనంసాక్షి):** మక్తల్ మండలంలోని మాధ్వార్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గ్రామ సర్పంచ్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తన వంతు సహకారాన్ని అందిస్తూ మరోసారి ఆదర్శంగా నిలిచారు. గతంలో గ్రామసభలో ఇచ్చిన హామీ మేరకు తన ఐదు నెలల జీతానికి సమానమైన రూ.34 వేల చెక్కును శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరాములు, ఉపాధ్యాయులు ఆంజనేయులు, రాములకు వార్డు సభ్యుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పన, నాణ్యమైన విద్య అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గ్రామ ప్రజలు, దాతలు కూడా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ముందుకు వచ్చి తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ అందించిన విరాళంపై ప్రధానోపాధ్యాయులు వెంకటరాములు, ఉపాధ్యాయులు ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులను పాఠశాల అవసరాలకు వినియోగించి విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, వార్డు సభ్యులు డాక్టర్ ఆశప్ప, బాట నరసింహ, పుల్లకూరి నాగప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ కర్ని శ్రీనివాస్, బుడబోయి చంద్రప్ప, కథనుల్ల కిష్టప్ప, కర్నే బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# టూ వీలర్ అసోసియేషన్ జెండా ఆవిష్కరణ

**- ద్విచక్ర సృష్టికర్త గట్లిబ్ డైమ్లర్**
**- సేవలు గణనీయం**
**- అధ్యక్ష కార్యదర్శులు పొల్లమోని కరుణాకర్, అంతటి శివశంకర్**





**నాగర్ కర్నూల్, జూలై 3 (జనంసాక్షి):** ప్రపంచ ప్రఖ్యాతగాంచిన జర్మనీకి చెందిన గట్లిబ్ డైమ్లర్ ద్విచక్ర సృష్టికర్త సేవలు గణనీయమని జిల్లా కేంద్రంలో గట్లిబ్ డైమ్లర్ చిత్రపటానికి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి అనంతరం తెలంగాణ టూ విల్లర్స్, మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా టు వీలర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పొల్లమోని కరుణాకర్, అంతటి శివశంకర్ మాట్లాడుతూ, 1885లో జర్మనీకి చెందిన ద్విచక్ర సృష్టికర్త గట్లిబ్ డైమ్లర్ అనే వ్యక్తి ప్రముఖ ఇంజనీర్ మరియు పారిశ్రామికవేత, ఇంటర్నల్ కాంబినేషన్ ఇంజన్ తో నడిచే మోటార్ సైకిల్ ను మరియు కర్ల తయారీ రంగంలో ప్రపంచానికే పరిచయం చేసిన అగ్రగామిగా ఆయన జీవితం మరియు ఆవిష్కరణల అనేకం ఉన్నాయి అన్నారు. చేసిన సాహసం విజ్ఞానానికి వేగుచుక్కగా నేటికీ చెక్కుచెదరని అభిమానం ప్రజల్లో ఉన్నదని కొనియాడారు. నేటికీ సాధారణ వ్యక్తి నుండి గొప్ప గొప్ప వ్యక్తులు కూడా ద్విచక్ర వాహనాలను వినియోగించడమే కాకుండా వారి నిత్య అవసరాలను, గమ్యస్థానాలకు చేరే దిశగా ద్విచక్ర వాహనం వినియోగిస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టూవీలర్ మెకానిక్ అండ్ హెల్పర్స్ ద్విచక్ర వాహనాల మెకానిక్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. కావున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇచ్చే లేబర్ కార్డులను ద్విచక్ర కాని హెల్పర్స్ కూడా వర్తించే విధంగా లేబర్ కార్డులు అందించాలని తద్వారా మెకానిక్ వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్యపరంగా ఆర్థికపరంగా ప్రభుత్వం అండదండగా నిలుస్తుంది అని వారు కోరారు. నాగర్ కర్నూల్ జిల్లాలో టు విలర్స్ మెకానిక్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులు సుమారుగా 1500 మందికి పైగా ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు అని అన్నారు. జెండావిష్కరణ అనంతరం జై మెకానిక్, జై జై మెకానిక్ ల ఐక్యత వర్ధిల్లాలి, మెకానిక్ సభ్యుల స్వేచ్ఛ వర్ధిల్లాలి, అని నినాదాలు చేసి ఐక్యంగా సమిష్టిగా నిరంతరం కార్మికులందరూ ఒక కుటుంబ సభ్యులుగా మెలగాలని సభ్యులందరూ ముక్తకంఠంతో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సలహాదారుడు చిన్న మెకానిక్, సభ్యులు పాషా, కాజా పాషా, అశోక్, అంజి, బర్కత్, కృష్ణ, శేఖర్, రమేష్, మధు, వెంకట్, బషీర్, అంజి తోపాటు సుమారుగా 100 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై అవగాహన కల్పించిన గుమ్మడిదల తహసీల్దార్, కమిషనర్

**గుమ్మడిదల, జూలై 3 (జనంసాక్షి):** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (SIR) కార్యక్రమంలో యువత, యువజన సంఘాలు, బీఎల్‌ఏలు చురుకుగా పాల్గొనాలని గుమ్మడిదల తహసీల్దార్ మరియు మున్సిపల్ కమిషనర్ పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా ఖచ్చితమైన వివరాలు నమోదుకావాలంటే ప్రతి కుటుంబం తమ వివరాలను సరిచూసుకుని ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ఇప్పటికీ ఎన్యూమరేషన్ ఫారం అందని వారు తమ దీూాలను సంప్రదించాలని, 2002 ఓటరు జాబితాలో తమ పేర్లు మరియు కుటుంబ సభ్యుల వివరాలను జజుూ తెలంగాణ వెబ్‌సైట్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాన్ని జాగ్రత్తగా నింపి కలర్ ఫోటో, చిరునామా ధ్రువీకరణ పత్రం, వయస్సు ధ్రువీకరణ పత్రం జతచేసి తిరిగి దీూాకు అందజేసి రశీదు పొందాలని కోరారు. అదేవిధంగా ఎశీవతీ ూవతీజఅఎవ్రాశీతీఝశ్రీ ద్వారా స్వయంగా ూ×= ప్రక్రియను పూర్తి చేసుకునే అవకాశాన్ని కూడా వినియోగించుకోవాలని సూచించారు. తమ కుటుంబ సభ్యులతో పాటు ఇరుగు పొరుగు వారికీ ఈ ప్రక్రియలో సహకరించాలని, జూలై 24, 2026 లోపు ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని పక్షంలో డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు నమోదుకాకపోవచ్చని అధికారులు హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందుకు వచ్చి భారత ఎన్నికల సంఘం ప్రతిష్ఠను పెంపొందించాలని గుమ్మడిదల తహసీల్దార్ మరియు మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

**- ఉద్యమకారులకు 250 గజాల స్థలం హామీని వెంటనే అమలు చేయాలి**
**- మహిళా నాయకురాలిపై దాడి, రక్తపాతం దురదృష్టకరం**
**- కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ**




**గద్వాల, జులై 3(జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని కేటాయిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన భూ పోరాట కార్యక్రమంపై పోలీసులు ప్రదర్శించిన దురుసు వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ రాష్ట్ర నాయకులు గొంగళ్ళ రంజిత్ కుమార్ అన్నారు.

జోగులాంబ గద్వాల జిల్లా టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసమే టిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో భూ పోరాట కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేశారని, వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 250 గజాల స్థలం హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.భూ పోరాట కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో వ్యవహరించిందని ఆరోపించారు. మహిళా నాయకురాలు అని చూడకుండా కనీస గౌరవం కూడా లేకుండా అరెస్టులు చేయడం, దాడులకు పాల్పడడం వల్ల రక్తపాతం చోటుచేసుకోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. మహిళలపై జరిగిన ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా తమ హక్కుల కోసం పోరాడుతున్న ఉద్యమకారులపై అణచివేత చర్యలు చేపట్టడం సరైంది కాదని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల ఆశలు నెరవేర్చకుండా కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం టిఆర్ఎస్ పార్టీ భవిష్యత్తులో కూడా పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు బుచ్చిబాబు, వెంకట్రాములు,మండల నాయకులు బి.విష్ణు,లక్ష్మన్న, మునెప్ప,భూపతి నాయుడు గొర్ల తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనపై జిల్లా మంత్రుల చిన్నచూపు..?

**- మండల ప్రజలలో చర్చనీయంగా మారిన ప్రశ్న**

**మిడ్జిల్, జులై 3 (జనంసాక్షి):** మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన, బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో జిల్లా ప్రజల్లో ఒక ప్రశ్న చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనేంతటి కీలక కార్యక్రమం జరుగుతున్నప్పటికీ, జిల్లా మంత్రులు ఇప్పటివరకు మిడ్జిల్ వైపు రాకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాత్రమే క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే జిల్లా మంత్రులు స్వయంగా వచ్చి ఏర్పాట్లను పరిశీలించకపోవడం వెనుక కారణాలేంటనే ప్రశ్న స్థానికంగా వినిపిస్తోంది. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడానికి సాధారణంగా సంబంధిత జిల్లా ప్రజాప్రతినిధులు, మంత్రులు సమన్వయంతో పని చేయడం ఆనవాయితీ. అలాంటప్పుడు ఈ పర్యటన విషయంలో జిల్లా మంత్రుల గైర్హాజరు రాజకీయంగా ఏదైనా సంకేతమా? లేక ఇతర అధికారిక కార్యక్రమాల కారణంగానే రాలేకపోతున్నారా? అనే చర్చ



సాగుతోంది. ఇంతటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి జిల్లా మంత్రులు దూరంగా ఉండటం వెనుక అసలు కారణాలపై అధికార పార్టీ నాయకత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**గమనిక:** పై అంశాలు ప్రజల్లో వినిపిస్తున్న చర్చలు, ప్రశ్నల ఆధారంగా రూపొందించబడినవి. సంబంధిత వర్గాల అధికారిక వివరణ వస్తే పూర్తి చిత్రణ స్పష్టమవుతుంది.

# బీఆర్ఎస్ నుండి బీజేపీలో చేరిన జయానంద్



**మక్తల్, జూలై 03 (జనంసాక్షి):** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎం. జయానంద్ భారతీయ జనతా పార్టీలో (బీజేపీ) చేరారు. మక్తల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య ఆయనకు కమలం కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

**ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ...** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని పేర్కొంటూ, బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన జయానంద్‌కు తగిన గుర్తింపు లభిస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఎం. జయానంద్ మాట్లాడుతూ బీజేపీలో చేరడం సొంత ఇంటికి వచ్చినట్లుగా అనిపిస్తోందన్నారు. బీఆర్ఎస్ విధానాలు, నాయకత్వం వ్యవహరిస్తున్న తీరు నచ్చకపోవడంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పనిచేయాలనే సంకల్పంతో బీజేపీలో చేరినట్లు తెలిపారు. పార్టీ బలోపేతమే తన లక్ష్యమని, పార్టీ ఏ బాధ్యత అప్పగించినా పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల జాబితా సవరణపై సర్పంచ్ పిలుపు

**- ఎస్ ఐ ఆర్ సార్ వెరీ సీరియస్ సవరణను సీరియస్‌గా తీసుకోవాలి**
**- సర్పంచ్ డా. శ్రీనివాస్ రెడ్డి**



**మక్తల్, జూలై 03 (జనంసాక్షి):** మాద్వార్ ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియను గ్రామ ప్రజలందరూ అత్యంత బాధ్యతగా తీసుకుని ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని మాద్వార్ గ్రామ సర్పంచ్ డా. శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం గ్రామంలోని ఆరో వార్డులో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ)తో కలిసి ఇంటింటికీ వెళ్లి వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్నవారు తమ పేరు, చిరునామా, కుటుంబ వివరాలు సరిగా ఉన్నాయో లేదో ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. ఎవరైనా పేరు లేకపోయినా, తప్పులు ఉన్నా వెంటనే బీఎల్ఓ దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవాలని కోరారు.

ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని, ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా ప్రతి కుటుంబం ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలు బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించి సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి జిపిఓ వెంకటయ్య పంచాయతీ కార్యదర్శి రాజేష్ బిఎల్ఓ ఇందిరమ్మ వార్డు సభ్యులు డాక్టర్ ఆశప్ప బాట నరసింహ ప్యట ఎల్లప్ప వడ్ల నరేష్ చారి ఎర్రం కొల్ల రాము కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లులు ప్రారంభించిన వాకిటి లలితమ్మ



**అమరచింత, జులై 3 (జనంసాక్షి):** శుక్రవారం మండల పరిధిలోని చంద్ర గట్టుగ్రామంలో నూతన ఇందిరమ్మ ఇల్లు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభిం చారు. శ్రీమతి సునీత సురేష్ నూతన గృహప్రవేశానికి హాజరైన శ్రీమతి వాకిటి లలితమ్మ దంపతులకు నూతన వస్త్రములను అందజేసి ఆశీర్వదించారు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మండలంలో నాగల్ కడుమూరు గ్రామంలో శ్రీమతికుమారి. వెంకటన్నల నూతన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం చేశారు. గృహప్రవేశం వేడుకకు వాకిటి లలితమ్మ హాజరై వెంకటన్న దంపతులకు నూతన వస్త్రములను అందజేశారు వారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి జింక రవి గ్రామ అధ్యక్షులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విరిగిన విద్యుత్ స్తంభం.. ప్రమాదపు అంచున బొంతపల్లి కమాన్

**- రేకులపై ఆధారపడి నిలిచిన స్తంభం.. నిత్యం వందల మంది రాకపోకలు**
**- ఫిర్యాదులు చేసినా స్పందించని విద్యుత్ శాఖ అధికారులు**
**- ప్రమాదం జరిగితే బాధ్యత అధికారులదే : కౌన్సిలర్ నర్సంపల్లి రాజిరెడ్డి**



**గుమ్మడిదల, జూలై 3 (జనంసాక్షి):** ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన విరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించడంలో విద్యుత్ శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి కమాన్ గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభం అడుగు భాగం పూర్తిగా విరిగిపోయి, సమీపంలోని దుకాణం రేకులపై ఆధారపడి నిలిచింది. స్వల్ప గాలి వీచినా లేదా భారీ వాహనం వెళ్లినా కూలిపోయే పరిస్థితి నెలకొనడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

ఈ రహదారి గుండా ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, మహిళలు, రైతులు, వ్యాపారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రద్దీ సమయంలో స్తంభం కూలితే భారీ ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్తంభానికి అనుసంధానంగా ఉన్న విద్యుత్ తీగలు కూడా ప్రమాదకరంగా ఉండటంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది.

ఈ విషయాన్ని పలుమార్లు విద్యుత్ శాఖ ఏఈ, ఏడీఈ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం విచారకరమని 18వ వార్డు కౌన్సిలర్ నర్సంపల్లి రాజిరెడ్డి మండిపడ్డారు. ఫోన్ చేసినా స్పందించకపోవడం, ప్రమాదాన్ని ముందే నివారించేందుకు చర్యలు తీసుకోకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు.

"ప్రమాదం జరిగిన తర్వాత హడావుడిగా స్పందించడం కాదు... ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలి. ఏదైనా అపశృతి చోటుచేసుకుంటే దానికి పూర్తి బాధ్యత విద్యుత్ శాఖ అధికారులదే" అని రాజిరెడ్డి హెచ్చరించారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని విరిగిన స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాను సురక్షితంగా మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# జర్నలిస్టుల జిల్లా మహాసభను విజయవంతం చేయండి

**- సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున తరలిరండి**
**- ఐజేయు తాలూకా ఉపాధ్యక్షులు డాకూరి రాజేష్**

**జోగిపేట, జూలై 3 (జనంసాక్షి):** జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా మహాసభను రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే పైసల్, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు నేతృత్వంలో ఈనెల 9వ తేదీన జరిగే జిల్లా ఐజేయూ జర్నలిస్టుల మహాసభకు అందోల్ నియోజకవర్గంలో ఉన్న ఆయా మండలాలకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ మహాసభ విజయవంతం చేయాలని అందోల్ ఐజేయూ తాలూకా ఉపాధ్యక్షులు డాకూరి రాజేష్, కోశాధికారి గొర్లకాడి కుమార్‌లు కోరారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభకు భారీ సంఖ్యలో హాజరై సమస్యల పరిష్కారానికి సహకరించాలని అన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు రావాల్సిన ఇండ్ల స్థలాలు ఇండ్లు, హెల్త్ కార్డులు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, అక్రిడేషన్ కార్డులను సాధించడం జరుగుతుందని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఈ మహాసభ నిర్వహిస్తున్నారని వారు పేర్కొన్నారు. అందోల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆయా మండలాల జర్నలిస్టులు 9వ తేదీన సంగారెడ్డిలోని టీఎన్జీవో భవనంలో నిర్వహించే టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జర్నలిస్టుల మహాసభకు విధిగా హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

# చేసిన పనులకు బిల్లులు రాక అప్పుల పాలయ్యాను

**- ఆత్మహత్య శరణ్యం అంటున్న కాంట్రాక్టర్ సురేందర్ రెడ్డి**



**తూప్రాన్, జులై 3 (జనంసాక్షి):** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో సుమారు 8 0లక్షల పనుల కాంటాక్ట్ పనులు చేశానని బిల్లులు రాకపోవడంతో అప్పుల పాలయ్యానని ఏ అధికారి దగ్గరకు వెళ్లిన తామేమి చేయలేమంటూ చెబుతున్నారని బిల్లు వస్తాయని అప్పులు చేసి మరీ కట్టానని వడ్డీలు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నానని బిల్లులు రాకపోతే తనకు ఆత్మహత్య శరణ్యమని ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హాయంలో తూప్రా మనోహరాబాద్ మండలాలు సుమారు 80 లక్షల వరకు పనులు చేశానని ప్రభుత్వ మారడంతో ఈ ప్రభుత్వ హ్యాములోనైనా వస్తాయని ఆశతో ఎదురుచూస్తున్నానని అధికార చుట్టూ కార్యాలయంలో చుట్టూ తిడుతున్న ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆత్మహత్య శరణ్యమని తెలిపారు. బిల్లులు రాకుంటే తనకు వేరే దిక్కు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోతారం గ్రామంలో 15 లక్షలతో హెల్త్ కమ్యూనిటీ సెంటర్ తూప్రాన్ ఎస్సీ కాలనీలో కల్వర్టుకు 17 లక్షలు మాసాయిపేట లో 15 లక్షలతో కమ్యూనిటీ నిర్మాణాలు మరికొన్ని చిన్న చిన్న పనులు చేశానని , బిల్లులు వస్తాయన్న ఆశతో అప్పులు చేసి పనులు చేశానని చేసిన పనులకు బిల్లులు ఇప్పించాలని కార్యాలయాల చుట్టూ తిరిగిన ఆ ప్రభుత్వ హాయంలో చేశావు మెల్లగా ఇస్తాం అంటున్నారని, ఈ ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదంటూ సమాధానం చెబుతున్నారని అప్పులు కట్టలేక అప్పుల ఊబిలో కురుకుపోయా నని బిల్లులు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# మధ్యాహ్న భోజనం మాకెందుకు?

**- పిఆర్సి, డిఏలు ఇవ్వండి**
**- తపస్ జిల్లా అధ్యక్షులు నరసింహ**



**కొత్తపల్లి, జూలై 3 (జనంసాక్షి):** ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం టిఫిన్ ఇవ్వాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం అభ్యంతరకరమని, ఉపాధ్యాయులు ఎవరు ఇది కోరుకోలేదని తపస్ జిల్లా అధ్యక్షులు నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి అన్నారు. కొత్తపల్లి మండలంలో నగేష్ ఆధ్వర్యంలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ నాణ్యమైన మధ్యాహ్న భోజనం పాఠశాల విద్యార్థులకు అందిస్తే సరిపోతుంది అన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పిఆర్సి, డిఏలు ఇవ్వకుండా జాప్యం చేస్తూ ఉపాధ్యాయులకు ఆర్థిక నష్టం కలిగిస్తున్నారని వాపోయారు. కోరినవి ఇవ్వకుండా కోరనివి అవసరం లేనివి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం విడ్డూరంగా ఉందని అన్నారు. భాగంగా దుప్పటి గట్టు, గోకుల్ నగర్, అల్లీపూర్,ఎక్కమేడ్, మన్నాపూర్, కొత్తపల్లి, నిర్జింత, భూనేడు గ్రామాలలో ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్, నాయకులు విజయరెడ్డి, భీమ్సేన్, రాజు నరసింహులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల సొంతింటి కల సాకారం

**- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**శ్రీరంగాపూర్, జూలై 3 (జనంసాక్షి):** శ్రీరంగాపురం మండలం తాటి పాముల గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలు శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారు లతో కలిసి గృహప్రవేశాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులు రాధా-రాజా గౌడ్,మాధవి-బాలచందర్ నాయుడు, గజ్జలయ్య లక్ష్మి,నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంట్లో కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులు భావోద్వేగానికి లోనై తమ అనుభవాలను పంచుకున్నారు. గత పది సంవత్సరాల పాలనలో డబుల్ బెడ్రూమ్ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పి ఎన్నోసార్లు అధికారుల చుట్టూ, రాజకీయ నాయకుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు.అద్దె ఇళ్లలో, పాడుబడిన గుడిసెల్లో ఎన్నో కష్టాలు పడుతూ జీవించామని, సొంతింటి కోసం ఎన్నో సంవత్సరాలు ఎదురు చూశామని తెలిపారు. అయితే నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో,వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరై తమ జీవితాల్లో వెలుగులు నింపాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారుప్రభుత్వం అందించిన రూ.5 లక్షల సహాయంతో తమ కలల ఇంటిని నిర్మించుకొని నేడు గృహప్రవేశం చేసుకోవడం జీవితంలో మరచిపోలేని ఘట్టమని పేర్కొన్నారు.సొంతింటి కల నెరవేరుతుందని ఎప్పుడూ ఊహించలేదు. మా బాధలను అర్థం చేసుకొని ఇల్లు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మా ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి జీవితాంతం రుణపడి ఉంటాం అని లబ్ధిదారులు కృతజ్ఞతా భావంతో తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తోం దన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు అందేలా కృషి చేస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

# సమాజ సేవ నుంచి మోటివేషనల్ ట్రైనింగ్ వరకు

**- ప్రేరణాత్మక సేవలకు గుర్తింపు పొందిన శాలిని - రాజు గౌడ్**



**చేర్యాల, జులై 03 (జనంసాక్షి):** సామాజిక స్వచ్ఛంద సేవకురాలు, లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డు గ్రహీత రావుల శాలిని-రాజు గౌడ్ మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపును అందు కున్నారు. గత కొన్ని సంవత్స రాలనుండి సమాజ సేవ, మహిళా సాధికారత, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆమె తాజాగా ఇంపాక్ట్ సర్టిఫైడ్ మోటివేషనల్ ట్రైనర్‌గా గుర్తింపు పొందారు.ఇంపాక్ట్ సంస్థ నిర్వహించిన 30 రోజుల ఆన్‌లైన్ శిక్షణతో పాటు రెండు రోజుల ఆఫ్‌లైన్ వర్క్‌షాప్‌ను విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం, ఇంపాక్ట్ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వరరావు, ప్రముఖ ట్రైనర్, బాల్యం అమూల్యం పుస్తక రచయిత సుధీర్ సంద్ర చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ట్రైనర్లు కె. రామ చంద్రుడు, ఐసీఐ మాజీ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ సోని, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షాలిని-రాజు గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, లక్ష్యసాధన, విలువలతో కూడిన జీవన నైపుణ్యాలపై ఉచిత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువులు, తల్లిదండ్రులు, విద్యార్థుల మధ్య సత్సంబంధాలను పెంపొందిస్తూ బాధ్యతాయుత పౌరులను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు."ఇంటికో స్పీకర్ – ఊరికో ట్రైనర్" అనే ఇంపాక్ట్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి మరింత అంకితభావంతో పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు.

# గ్రామాల్లో చెత్త సేకరణ సమర్ధవంతంగా అమలు చేయాలి

**- మెదక్ జిల్లా సీఈవో ఎల్లయ్య**





**పెద్ద శంకరంపేట, జూలై 3 (జనంసాక్షి):** గ్రామాలలో చెత్త సేకరణ సమర్థవంతంగా అమలు చేయాలని, ఇంటింటికి నాలుగు రకాల చిత్త సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పించాలని,గ్రామాలను పరిశుభ్రంగా పచ్చదనంతో తీర్చిదిద్దడంతో పాటు వర్షాకాలంలో ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మెదక్ జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణ, వన మహోత్సవం, వర్షాకాల సన్నగతంలో పాటు వర్షాకాలంలో చేపట్టాల్సిన మందస చర్లపై పంచాయతీ కార్యదర్శులు , ఫీల్డ్ అసిస్టెంట్లు తో శుక్రవారం నాడు పేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇంటింటికి చిత్త సేకరణ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ఇంటింటికి స్టిక్కర్ల పంపిణీ, అతికింపు కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ ప్రజలకు ఆదర్శంగా ముందుగా గ్రామాల సర్పంచ్లు, వార్డు సభ్యుల ఇండ్లలోని నాగు రకాల చెత్త వేరు చేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. వన మహోత్సవ కార్యక్రమాలను వేగవంతం చేసి విస్తృతంగా మొక్కలు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యచరణ చేపట్టాలని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని మాన్సూన్ ప్రిపేర్డ్ నెస్ చర్యలను సీఈవో ఎల్లయ్య ఆదేశించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం , ఇక్కడ వర్షపు నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవడం, దోమల నివారణకు కార్యక్రమాలను ముమ్మరం చేయడం, త్రాగునీటి పరిశుభ్రతను నిర్ధారించడం, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలతకుండా ముందస్తు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి కుమార్, ఎంపీఓ జాకీర్ హుస్సేన్, ఏపీవో సంతోష్ కుమార్, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతం



**మక్తల్, జూలై 03 (జనంసాక్షి):** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయ వంతమైనందని లయన్ సత్యాంజ నేయులు తెలిపారు. లయన్‌క్లబ్ అధ్యక్షుడు సత్యాంజనేయులు అధ్యక్షతన అనుగొండ శ్రీనివాసు లు డిస్ట్రిక్ విజన్ ఛైర్మెన్ ఆధ్వ ర్యంలో రామ్ రెడ్డి లయన్స్ కమిటీ ఆస్పత్రి ఎనుగొండ మహబూబ్‌నగర్ వారి సహకారంతో ఉచిత కంటి పరిక్ష శిబిరం నిర్వహించారు. 100 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 46 మందికి ఉచిత కంటి ఆపరేషన్ కొరకు మహబూబ్నగర్ రామిరెడ్డి లైన్స్ కంటి ఆసుపత్రికి ఉచిత బస్సులో పంపించారు. వారికి ఉచిత భోజన వసతి సదుపాయాలతో ఆపరేషన్ చేసి ఉచితంగా బస్సులో మక్తల్ కు తిరిగి పంపించడం జరుగుతుందని అధ్యక్షులు లయన్స్ సత్యాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు లయన్ అంజన్న ప్రసాద్, కోశాధికారి లయన్ ఎస్ రమేష్ రావు, పాస్ట్ రీజన్ చైర్ పర్సన్ లయన్ జి జైపాల్ రెడ్డి, డిస్టిక్ చైర్ పర్సన్ లయన్ టి నాగరాజు, ప్రెసిడెంట్ ఎలెక్ట్ లైన్ బి అంబాదాసు రావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి మరో అడుగు... డ్రైనేజీ పనులు ప్రారంభం



**పుల్కల్, జూలై 3 (జనంసాక్షి):** మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో గ్రామాభివృద్ధికి మరో అడుగు పడింది.గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా శుక్రవారం బైట హనుమాన్ మందిరం నుంచి పుర్ర మల్లయ్య ఇంటి వరకు చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ పడమటి రమేష్ శుక్రవారం కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు నిరంతరం చేపడుతున్నామని,మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. గ్రామాభివృద్ధే ధ్యేయంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఉపసర్పంచ్ బానోత్ ఈశ్వర్, గ్రామ పెద్దలు ప్రభాకర్ రెడ్డి, అశోక్ రెడ్డి, పుర్ర దుర్గయ్య, ఇందూరి మోహన్, సురేష్, మనోజ్, అఫ్రిన్ యాసీన్, పుర్ర సురేష్, అనిల్, గీత, శివకుమార్, అనురాధ, నగేష్, సంగమేష్, వార్డు సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు కుమారి యాదయ్య, పల్లె మల్లేశం, సత్యం గౌడ్, ఎర్రగొల్ల పెంటయ్య, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక దూర విద్యా విధానంలో ప్రవేశాలు ప్రారంభం



**చేర్యాల, జులై 03(జనంసాక్షి) :** చదువు మధ్యలో ఆపేసిన వారికి, ఎలాంటి అవాంతరాలు ఏర్పడినప్పటికీ చదువు మళ్లీ కొనసాగించడానికి 14 సంవత్సరాలు నిండిన అన్నివర్గాల వారికి పై చదువులు చదవలేమని నిరుత్సాహపడే యువతి యువకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు, పలు వృత్తి, వ్యాపార రంగంలో ఉన్నవారికి విద్యారంగంలో సంపూర్ణ పరిజ్ఞానాన్ని సముపార్జించి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలన్నా యువతకు సార్వత్రిక దూరవిద్య విధానం ద్వారా పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పూర్తి చేయడానికి జడ్పీహెచ్‌ఎస్ పెద్దమ్మగడ్డ చేర్యాల తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) సాదరంగా ఆహ్వానం పలుకుతుంది. విద్యార్హత పెంపొందించుకోవడానికే కాక ఉద్యోగం ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్న వారు డిగ్రీ, పీజీ, బీటెక్ ఉన్నత చదువులకు కూడా తెలంగాణ ఓపెన్ స్కూల్స్ సొసైటీ అందిస్తున్న సర్టిఫికెట్స్ గేట్వే మాదిరిగా ఉపయోగపడతాయని జడ్పీహెచ్‌ఎస్ పెద్దమ్మగడ్డ చేర్యాల ప్రధానోపాధ్యాయులు, ఏఐ కోఆర్డినేటర్ వి. సురేష్ కుమార్ తెలిపారు. ఈ సార్వత్రిక దూర విద్యా విధానంలో ఎస్ఎస్సీ లేదా ఇంటర్మీడియట్ సింగిల్ సీటింగ్ ద్వారా ఒకే విద్యా సంవత్సరంలో పూర్తి చేసుకోవచ్చని ఈ సర్టిఫికెట్ రెగ్యులర్ విద్యలో సంపాదించిన సర్టిఫికెట్‌కు సమానమని అభ్యాసకులు గుర్తుంచుకోవాలి. సార్వత్రిక విద్య ద్వారా ఉజ్వల భవిష్యత్తును అందిపుచ్చుకోవడానికి ఆసక్తి ఉన్న అభ్యాసకుల ప్రవేశాల నిమిత్తం 2026-27 విద్యా సంవత్సరమునకు షెడ్యూల్ విడుదలైనది కాబట్టి అడ్మిషన్ పొందగోరు అభ్యర్థులు జూలై 28 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా అడ్మిషన్ పొందడానికి నేరుగా జడ్పీహెచ్‌ఎస్ పెద్దమ్మగడ్డ చేర్యాల అధ్యయన కేంద్రాన్ని సంప్రదించి గాని, 9949106117, 9666274952 ఫోన్ నెంబర్ల ద్వారా గాని వివరాలు తెలుసుకొని అవసరమైన ధ్రువపత్రాన్ని కార్యాలయంలో అందజేసి అడ్మిషన్ పొందవచ్చని పాఠశాల కోఆర్డినేటర్ తెలిపారు.

# వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**కొండాపూర్, జూన్ 3 (జనంసాక్షి):** తాళ్లపల్లి రోడ్డు కేఎస్ గార్డెన్‌లో మండల పరిధిలోని గంగారం గ్రామానికి చెందినమాజీ సర్పంచ్ నర్సింలు, కుమార్తె వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, సాయినాథ్, మ్యాకం విఠల్, శ్రీధర్ రెడ్డి, రుక్మోదిన్, ప్రేమానందం, నవీన్, జంగం శేఖర్, రవీందర్ తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివాహ వేడుకకు హాజరైన బంధుమిత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు నూతన దంపతులను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# దూప దీప నైవేద్యం

# రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గుడి.చంద్ర శేఖర్....



**పెద్ద శంకరంపేట, జూలై 3 (జనంసాక్షి):** మెదక్ జిల్లా పెద్ద శంకరం పేట మండల కేంద్రానికి చెందిన ప్రముఖ పురోహితులు, అర్చకులు అయిన గుడి. చంద్రశేఖర్ తెలంగాణ రాష్ట్ర దూప దీప నైవేద్యం అర్చక సంఘంనకు ఉపాధ్యక్షులుగా మరోమారు నియమితులు అయ్యారు. హైదరాబాద్‌లో బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్ హాలోలో బ్రాహ్మణ సంక్షేమ పరిషద్ చైర్మెన్ శ్రీ బసవరాజు శ్రీనివాస్ వీరిచే ప్రమాణ స్వీకారం గావించారు. రాష్ట్రస్థాయి అర్చకుల సేవకు గాను తనపై నమ్మకం తో ఉపాధ్యక్ష పదవి లో నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు శ్రీ. దౌలతాబాద్. వాసుదేవ శర్మ మరియు మెదక్ జిల్లా అధ్యక్షులు శ్రీ. శలాక. రాజేశ్వర్ శర్మ ఈ సందర్భంగా గుడి చంద్రశేఖర్ ధన్యవాదములు తెలిపారు.

# హుండీ ఆదాయం రూ 65.89 లక్షలు

**పాపన్నపేట, జులై 3 (జనంసాక్షి):**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. శుక్రవారం ఆలయ సమీపంలోని గోకుల్ షెడ్‌లో ఈఓ మఠం వీరేశం,దేవాదాయ శాఖ ఇన్స్ పెక్టర్ రంగారావు సమక్షంలో హుండీ లెక్కింపును చేపట్టారు. కాగా గడిచిన 77 రోజులకు గాను హుండీ ఆదాయం రూ.65.89.200 దేవస్థానానికి సమాకూరింది. మిశ్రమ బంగారం 000.038.000 గ్రాములు,మిశ్రమ వెండి 001.230.000 గ్రాములు వచ్చింది. ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్,కరీంనగర్ శ్రీ వెంకట అన్నమాచార్య సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు రకాల చెత్తలపై అవగాహన



**నిజాంపేట, జూలై 3 (జనంసాక్షి):** నాలుగు రకాల చెత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాంపూర్‌లో సర్పంచ్ ప్రవీణ్, కార్యదర్శి చంద్రహస్ ఆద్వర్యంలో ఇంటింటికి చెత్త ట్రాక్టర్ ను తీసుకు వెళ్లి నాలుగు రకాల చెత్తలపై అవగాహన కల్పించారు.

# నిల్వాలు గుర్తించి.. సీజ్ చేసి



**పాపన్నపేట, జులై 3 (జనంసాక్షి) :** అక్రమ ఇసుక నిల్వలను సీజ్ చేసినట్లు తహశీల్దార్ సతీష్ కుమార్ తెలిపారు. కొత్తపల్లి గ్రామ శివారు మంజీరా నది నుండి పలు చోట్ల తీసిన సుమారు 6 ట్రాక్టర్ల అనుమతి లేని ఇసుక నిల్వలను శుక్రవారం గ్రామ పాలనాధికారి సమక్షంలో సీజ్ చేశారు. రెవెన్యూ ఆర్ఐ శరత్,పోలీస్ సిబ్బంది శివకుమార్ తదితరులు ఉన్నారు.

# మృతుని కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక సాయం



**వెల్దండ, జూలై 03 (జనంసాక్షి):** వెల్దండ మండల పరిధిలోని పోతేపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు చంద్రయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి, పోతేపల్లి సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు తక్షణ ఖర్చులకు గాను తన వ్యక్తిగతంగా రూ. 3 వేల రూపాయల నగదును అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఎగిరిశెట్టి శివకుమార్, ఉడుత బాలు, తాండ్ర సాయిబాబు, తాండ్ర అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# డిల్లీ మీడియా సదస్సుకు పేట డీపీఆర్ఓ రషీద్



**నారాయణపేట జిల్లా బ్యూరో జూలై 3(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం ఏ రషీద్ ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా కమ్యూనికేషన్ అధికారుల జాతీయ సదస్సుకు హాజరయ్యారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోని ఐఐఐడిఈఎంలో జరిగిన ఈ సదస్సులో మీడియా నిర్వహణ, ప్రజా కమ్యూనికేషన్, ఎన్నికల సమాచార ప్రచారంపై సాంకేతిక సెషన్లలో ఆయన పాల్గొన్నారు. ఈ జాతీయ సదస్సుకు తెలంగాణ నుంచి ఎంపికైన అధికారులలో రషీద్ ఒకరు.

# గుగ్గిళ్లలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం

**- ప్రజలు భాగస్వాములు కావాలి**
**- ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ**



**బెజ్జంకి,జూలై 3,(జనంసాక్షి):** మండలంలోని గుగ్గిళ్ల గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్ – స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మానకొండూరు శాసన సభ్యులు, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ డా.కవ్వంపల్లి సత్యనారాయణ,కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు.అనంతరం కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది అని,అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంతో పాటు,వివరాల్లో మార్పులు ఉంటే సవరణలు చేయించుకోవాలని సూచించారు.ప్రతి అర్హత గల పౌరులు తన ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.అనంతరం గ్రామ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి,ఓటరు నమోదు,పేర్ల సవరణ,చిరునామా మార్పు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజలు సహకరించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,ఎమ్మార్వో శ్రీకాంత్,ఎంపీడీవో ప్రవీణ్,ఏఎంసి చైర్మన్ పులి కృష్ణ,అక్కరవేణి పోచయ్య,చెప్యాల శ్రీనివాస్,చెట్టి రాజు,గ్రామ సర్పంచ్‌లు,ఉప సర్పంచ్‌లు,వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# గుర్తింపు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి : పీడీఎస్‌యూ



**జహీరాబాద్, జులై 3(జనంసాక్షి):** ప్రభుత్వ అనుమతులు, గుర్తింపు లేకుండా భృంగి ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహిస్తున్నట్లు ఆరోపిస్తూ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం అధికారికి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్ మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండానే పాఠశాలలో అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు మండల ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. గుర్తింపు లేని పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన మండల ఎంఈఓపై కూడా చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి ఈ. గోపాల్‌తో పాటు రాజ్, రాకేష్, మహ్మద్ రఫీ, శంషాద్, భాగ్యశ్రీ, అంబిక, వైష్ణవి, అక్షయ, భవాని, సాక్షి, సంధ్య పాల్గొన్నారు.

# రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసిన తహసిల్దార్



**మల్దకల్, జులై 3 (జనంసాక్షి):** జోగులంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండలం చర్ల గార్లపాడు గ్రామంలో రేషన్ దుకాణాన్ని శుక్రవారంతహసిల్దార్ ఝాన్సీరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు.రేషన్ షాపులో స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు.జూలై నెల సంబంధించిన రేషన్ బియ్యాన్ని సక్రమంగా లబ్ధిదారులకు అందించాలని, రేషన్ బియ్యం ప్రతి ఒక్కరికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని,స్టాక్ బోర్డు పెట్టాలని రేషన్ డీలర్ కు సూచించారు.అనంతరం సర్ సర్వే పారాలను ఇంటింటికీ సక్రమంగా అందించారా లేదా అని బిఎల్ఓను అడిగి తెలుసుకున్నారు.ప్రతి ఇంటికి పారాలను అందించాలని ప్రతి ఓటరు జాబితాలో ఓటుకున్న వివరాలను తెలుసుకొని దరఖాస్తుపారాలను నింపి బిఎల్ఓ లకు ఇవ్వాలని సూచించారు.ఈమె వెంటజిపిఓ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం : ఎమ్మెల్యే మాణిక్‌రావు



జహీరాబాద్, జూలై 3(జనంసాక్షి): జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ చెక్కులను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పేదలకు వరంగా నిలుస్తోందన్నారు. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే నిరుపేదలకు ఈ నిధి ఎంతో అండగా ఉంటోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తంజిం, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ గౌస్ గోరి, బరూర్ దత్తాత్రి, హోతి(బి) గ్రామ సర్పంచ్ మచ్చేందర్, యువ నాయకుడు కొనింటి మిథున్‌రాజ్, నాయకులు షకీల్, గోపాల్, చిన్నరెడ్డి, సయ్యద్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు

### ఉత్తీర్ణత సాధించిన

## విద్యార్థులకు నగదు బహుమతులు

**- శాశ్వత దాతకు అభినందనల వెల్లువ**



చేర్యాల, జూలై 03 (జనంసాక్షి): మండలంలోని వేచరేణి గ్రామానికి చెందిన జడ్పిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు శుక్రవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమానికి చేర్యాల మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) బైర నరేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయ బృందం సమక్షంలో గ్రామ వాస్తవ్యులు శాశ్వతదాత దేవస్థానం పర్వాటకం లక్ష్మారెడ్డి తన సహాయంగా రూ. 2000 నుంచి 5వేల వరకు నగదు బహుమతులు అందజేశారు. అంతేకాకుండా పాఠశాలకు కంప్యూటర్లు, హోమ్ థియేటర్, హైదరాబాద్ రోటరీ క్లబ్ ద్వారా బాలికలకు సుమారు లక్షల విలువ చేసే మరుగుదొడ్లు, వాటర్ ప్యూరిఫైర్, ల్యాబ్లు దుస్తులు బ్యాగులు బ్యాడ్జీలు, బెల్టులు, అంతేకాకుండా పాఠశాలకు రెండు కోట్ల విలువ చేసే తన సొంత భూమిని పాఠశాలకు దానం చేసి ఎంతో ఆదర్శంగా నిలిచారని ఆయన సేవలను ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు అభినందించారు. ఇలాంటి సేవలు మరింత చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు

## అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



చిన్నంబావి, జూలై 4 (జనంసాక్షి): చిన్నంబావి మండల కేంద్రంలోని దగడపల్లి గ్రామంలో సిరసన గండ్ల ప్రమీలమ్మ w/o రామారావు గత కొన్ని రోజుల నుండి వెన్ను నొప్పితో బాధపడుతూ హాస్పిటల్‌లో చూయించుకొని ఆర్థిక భారంతో బాధపడ్తున్న విషయంను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడం తో జూపల్లి కృష్ణారావు నేనున్నాను అని భరోసానిస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 1,60,000 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంజూరు చేయించారు. ఇట్టి సీఎంఆర్ఎఫ్ చెక్కును గ్రామ కాంగ్రెస్ నాయకులు అందజేసిన సందర్భంగా రామారావు అతని సతీమణి ప్రమీలమ్మ సంతోషంతో జూపల్లి కృష్ణారావుకి ప్రజా ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దగడపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతలు పాటించాలి..

**- జిల్లా అధికారి దేవ్ కుమార్**



నిజాంపేట, జూలై 3 (జనంసాక్షి): పరిశుభ్రతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, (జిల్లా వ్యవసాయ అధికారి) మండల ప్రత్యేక అధికారి దేవ్ కుమార్ సూచించారు. నిజాంపేట మండలం నందిగామ గ్రామాన్ని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా.. పరిశుభ్రతలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడి కేంద్రన్నీ పరిశీలించి విద్యార్థులకు అందుతున్న పౌష్టిక ఆహారం, మధ్యాహ్న భోజన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, ఇంటి చుట్టుపక్కల మొక్కలు నాటి పర్యావరణానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రజనీకాంత్ రెడ్డి, కార్యదర్శి యాదవ లక్ష్మి, నాయకులు ఆకుల రమేష్ ఉన్నారు.

### వర్షాకాలం

## తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష..



నిజాంపేట,జూలై 3 (జనంసాక్షి): వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో కార్యదర్శులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపీవో రజనీకాంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. నిజాంపేట ఎంపీడీవో కార్యాలయంలో నాలుగు రకాల చెత్తల సేకరణ, దోమల నియంత్రణ ఫాగింగ్, నీటి ట్యాంకుల శుభ్రత, ప్రతి రోజు క్లోరినేషన్ వివిధ అంశాలపై తగు సూచనలు చేశారు. సమీక్షలు అన్ని గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

### ముఖ్యమంత్రిపై

## అనుచిత వ్యాఖ్యలు పై ఫిర్యాదు



పెబ్బేరు జూలై 03 (జనంసాక్షి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలతో పోస్టులు పెట్టిన అనుమానస్పద వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ... పెబ్బేరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాపర్ల రామిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాపర్ల రామిరెడ్డి మాట్లాడుతూ...రాజకీయ కక్షతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం, పరువుకు భంగం కలిగించే పోస్టులు పెడుతున్నరని ఆరోపించారు. ముఖ్యమంత్రిని ఉద్దేశించి అత్యంత అసభ్యకరమైన బూతులతో కూడిన భాషను ఉపయోగించి కామెంట్ చేయడం శాంతిభద్రతకకు విఘాతం కలిగించే అవకాశం ఉందని ఇట్టి విషయంపై విచారణ జరిపి అట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్,వెంకటేష్ సాగర్,సురేందర్ గౌడ్,రామన్ గౌడ్,నరేందర్, నరసింహ నాయుడు, రణధీర్ రెడ్డి,సత్యనారాయణ రెడ్డి మరియు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



చౌటుప్పల్, జూలై 03 (జనంసాక్షి): మండల కేంద్రంలోని తాడ్డాన్పల్లి గ్రామంలో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీ మఠం భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు నిర్వహించిన ధార్మిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చంద్రకళ చంద్రయ్య, పెంటయ్య, నిసార్, లడ్డు తదితర ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీసీ రోడ్లకు నిధులు మంజూరు

**- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు**



శివ్వంపేట, జూలై 3 (జనంసాక్షి): శివ్వంపేట మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధికీ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి నిధులు మంజూరు చేయడం జరిగిందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. శివ్వంపేట ఎస్సీ కాలనికి రూ. 3 లక్షలు, చిన్నగొట్టి ముక్క ఎస్సీ కాలనికి రూ. 3 లక్షలు, తిమ్మాపూర్ ఎస్సీ కాలనికి 2.50 లక్షలు, మగ్దుంపూర్ ఎస్సీ కాలనికి రూ. 2.50 లక్షలు, దొంతి ఎస్సీ కాలనికి రూ. 2.50 లక్షలు, చండి ఎస్సీ కాలనికి రూ. 3 లక్షలు, నవాబుపేట ఎస్సీ కాలనీకీ రూ. 3 లక్షలు, లింగోజిగూడ ఎస్సీ కాలనీకీ రూ. 2.50 లక్షలు, కొత్తపేట ఎస్సీ కాలనీకీ రూ. 2.50 లక్షలు, టిక్యా దేవమ్మ గూడెం తండా కు రూ. 2.50 లక్షలు, మల్లుపల్లి ఎస్సీ కాల నీకీ రూ. 2.50 లక్షలు, చెన్నాపూర్ ఎస్సీ కాలనీకీ రూ. 2.50 లక్షలు, బిజిలిపూర్ ఎస్సీ కాల నీకీ రూ. 3 లక్షలు, గూడూరు ఎస్సీ కాల నీకీ రూ. 2.50 లక్షలు, భోజ్యా తండాకు రూ. 3 లక్షలు, ఎదుల్లాపూర్ ఎస్సీ, ఎస్టీ కాలనీలకు రూ. 3 లక్షలు, ఉసిరికపల్లి ఎస్సీ, ఎస్టీ కాలనీలకు రూ. 2.50 లక్షలు ఇలా మొత్తం అన్నీ గ్రామాలకు కలిపి 46 లక్షలు మంజూరు అయినట్లు రమణ గౌడ్ తెలిపారు. అడగగానే నిధులు మంజూరు చేసి, ఆయా గ్రామాల సామాజిక వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ, వారి యొక్క కాలనీలు అభివృద్ధి చెందడం కోసం సిసి రోడ్లు మంజూరు చేసిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కి ఆయా గ్రామాల బీ ఆర్ ఎస్ నాయకులతోపాటు మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఓటు నమోదు పై ప్రజల్లో అవగాహన...

**- పట్టణ అధ్యక్షులు దిలీప్ కుమార్ రెడ్డి**



పెబ్బేరు జూలై 3 (జనంసాక్షి): పెబ్బేర్ పట్టణంలో 5 మరియు 6 వ వార్డ్ లలో ఓటు పై పట్టణ ప్రజల్లో అవగాహనను బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు దిలీప్ కుమార్ రెడ్డి కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ పై చాలామందికి అవగాహన లేదని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని గుర్తు చేశారు. రెవిన్యూ అధికారులు బిఎల్ఓ తో పాటు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్లు గోపిబాబు రామకృష్ణ నాగిరెడ్డి రమేష్ గౌడ్ మోహన్ ద్యారంగుల శ్రీను రామకృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా భూమి బదలాయింపుపై ఆర్డీవోకు ఫిర్యాదు



అచ్చంపేట రూరల్, జూలై 03 (జనంసాక్షి): అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్ల బావి గ్రామానికి చెందిన ఆనంతుల వెంకటమ్మ భర్త అనంతరాములు కు తుర్కపల్లి రెవిన్యూ పరిధిలో సర్వేనెంబర్ 124 ఇ లో 14గుంటల పట్టా భూమిని అదే గ్రామానికి చెందిన దాసరి మల్లికార్జున్ ( ప్రస్తుతం ఉప్పునుంతల మండలంలో టైపిస్టుగా పనిచేస్తున్నారు) రెవిన్యూ విభాగంలో పనిచేసే క్రమంలో అక్రమంగా పట్టా చేసుకున్నారని శుక్రవారం ఆర్డీవో యాదగిరి కార్యాలయంలో కలిసి ఫిర్యాదును అందజేశారు. స్పందించిన ఆర్డిఓ యాదగిరి అమ్రాబాద్ తాసిల్దార్ వెంకటేశ్వర్ రెడ్డి కి ఫోన్ చేసి జిపిఓ గిర్దవర్ల ద్వారా భూమి సర్వే చేయించి రిపోర్టులు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. బాధితులు అమ్రాబాద్ నాయక్ తాసిల్దార్ దరఖాస్తును అందించారు

## ఆర్థిక సహాయం అందజేసిన శ్రీ కళ్యాణ్ ఫౌండేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్

**- కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో...**

**కొల్చారం, జూలై 3(జనంసాక్షి):** కొల్చారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో కళ్యాణ్ ఫౌండేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మాదారపు శ్రీనివాస్ తన కుమారుడు భౌతికంగా లేకున్నా తన జ్ఞాపకార్థం నేడు కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఇద్దరు పేద విద్యార్థులకు నిరీక్షణ, మహిమ ఇద్దరికీ కలిపి 10000 రూపాయలు పోస్ట్ ఆఫీస్ లో డిపాజిట్ చేసి పాసుబుక్ అందించడం జరిగిందనీ శ్రీనివాస్ తెలిపారు .గత రెండు సంవత్సరాల క్రితం తన కుమారుడు మాదార కళ్యాణ్ ఆరోగ్యంతో మరణించడం జరిగింది. శ్రీ కళ్యాణ ఫౌండేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ నెలకొల్పి పలు సేవా కార్యక్రమాలు చేస్తూ తన కుమారుడి పేరుమీద పదిమందికి సహాయం చేస్తే మంచి జరుగుతుందన్నారు. కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామంలో జనవరిలో అరికెలా ఏగొండ సతీమణి అర్కెల యాదమ్మ అనారోగ్యంతో మరణించడంతో అట్టి విషయాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులదారి మల్లేష్ గౌడ్ తెలుపగా అరికెల ఏగొండ కు ఇద్దరు కుమార్తెలు ఉన్నందున ఇద్దరికీ కలిపి 10000 రూపా



యలను బాలిక సమృద్ధి యోజన పథకం ద్వారా పోస్ట్ ఆఫీస్‌లో డిపాజిట్ చేసి 30 పాసుబుక్కులను ఈరోజు శ్రీ కిష్టాపూర్ గ్రామానికి తనే స్వయంగా వచ్చి తల్లిని కోల్పోయిన నిరీక్షణ. మహిమ. లను దగ్గరికి తీసుకుని డిపాజిట్ చేసిన పాసుబుక్కులను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు తోష నవీన్. గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మలకే ప్రవీణ్, నాగుల గారి నాగరాజుగౌడ్ ,అక్కేమ్ శ్యామ్, కమ్మరి భాస్కర్, అరికెల నర్సింలు ,ఆరికెలా దుర్గయ్య, పెద్దుల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపురం తండాలో వ్యక్తి హత్య.. కేసు నమోదు చేసిన పోలీసులు

**కేటిదొడ్డి, జూలై 03(జనంసాక్షి):** మండల పరిధిలోని మల్లాపురం తండాలో గురువారం జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన రాజు నాయక్ (45) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు మల్లాపురం తండాకు చెందిన రాజు నాయక్ (45) పై.. ఆయనకు వరుసకు అల్లుడైన పాండు నాయక్ అనే వ్యక్తి గురువారం మధ్యాహ్నం తీవ్ర ఘర్షణకు దిగాడు.ఈ క్రమంలో పాండు నాయక్ విచక్షణారహితంగా దాడి చేస్తూ రాజు నాయక్ పొత్తికడుపులో మోకాలితో బలంగా తన్నాడు. అంతటితో ఆగకుండా చేతిలోని కట్టెతో రాజు నాయక్



తలపై, నుదిటిపై కొట్టి తీవ్ర రక్తగాయాలు చేశాడు. దాడి జరిగిన అనంతరం శుక్రవారం తెల్లవారు జామున రాజు నాయక్‌కు తీవ్రమైన కడుపునొప్పి మొదలైంది. మూత్రం కూడా రాకుండా నరకయా తన పడుతుండటంతో, కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి భార్య నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీని వాసులు తెలిపారు.

## అమరచింత కాంగ్రెస్‌కు కొత్త సారథులు..
## మండల అధ్యక్షుడిగా రాజేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడిగా రవికాంత్

**అమరచింత, జూలై 3 (జనంసాక్షి):** అమరచింత మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీలకు నూతన అధ్యక్షులను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నందిమల్ల గ్రామ సర్పంచ్ రాజేందర్ రెడ్డిని, అమరచింత పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవికాంత్‌ను నియమించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీలను పునర్వ్యవస్థీకరిస్తున్న నేపథ్యంలో ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, రవికాంత్ హర్షం వ్యక్తం చేశారు. తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాగరాజ్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ





పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

## రంగాపురం పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

**కేటీదొడ్డి, జూలై 03 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా కే.టి.దొడ్డి మండలం పరిధిలోని రంగాపురం గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు గద్వాల నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు. రంగాపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో రూపుదిద్దుకోనున్న కాంపౌండ్ వాల్ (ప్రహరీ గోడ) నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, శాస్త్రోక్తంగా భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా పాఠశాల పరిరక్షణకు, విద్యార్థుల భద్రతకు ప్రహరీ గోడ నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, విద్యార్థుల సౌకర్యార్థం పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆయన ఆదేశించారు. పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి చొరవ తీసుకున్నందుకు గానూ గ్రామ సర్పంచ్ మరియు గ్రామస్తులు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారికి శాలువా కప్పి,



పూలమాలలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ భూమి పూజ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్ రాజా రెడ్డి, సర్పంచులు జయన్న, పవన్ కుమార్ రెడ్డి, ప్రముఖ నాయకులు ఉరుకుంద, యుగేందర్ గౌడ్, లక్ష్మీరెడ్డి గారితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై అసభ్యకర పోస్ట్

**- కాంగ్రెస్ నేతల ఫిర్యాదు**

**- రేవల్లి, జూలై 03 (జనంసాక్షి):** సోషల్ మీడియాలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అసభ్యకరంగా బూతు లు మాట్లాడుతూ పోస్ట్ పెట్టిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందజేశారు. రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుల్తాను ఆలీ నాయ కత్వంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధ వారం రేవల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. స్థానిక ఎస్సై రజితని కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేసి వివరించారు.



ఈ సందర్భంగా సుల్తాను ఆలీ మాట్లాడుతూ, ప్రజలచే ఎన్నుకోబడిన ముఖ్యమంత్రి పై ఇలా అసభ్యంగా వ్యాఖ్యలు చేయడం సమాజంలో అశాంతిని రేపే చర్య అని అన్నారు. అలాంటి వారిపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత అభ్యంతరకర పోస్ట్ యొక్క స్క్రీన్‌షాట్‌లను కూడా పోలీసులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బంగారు మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

**జడ్చర్ల, జూలై 3 (జనంసాక్షి):** కావేరమ్మపేట శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణలు చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త గోనెల నరేందర్ మహేశ్వరి దంపతులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని స్థానిక భక్తులు, మహిళలు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## పంజుగులలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం

**- ఇంటింటికీ ఫారాల పంపిణీ చేస్తున్న బీఎల్‌వో**



**కల్వకుర్తి,జూలై 3,(జనంసాక్షి):** కల్వకుర్తి మండలంలోని పంజుగుల గ్రామంలో ప్రత్యేక సర్వే కార్యక్రమం (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతోంది.ఈ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వో అశోక్ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. ప్రజలకు అవసరమైన వివరాలను తెలియజేస్తూ, ఫారాల నింపడం,సమర్పణకు సంబంధించిన సూచనలు అందించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములై తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని బీఎల్‌వో అశోక్ కోరారు.కార్యక్రమంలో దారమోని గణేష్, శివ ప్రసాద్ తదితరులు పాల్గొని సహకరించారు. గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా కొనసాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు

**మక్తల్, జూలై 03 (జనంసాక్షి):** మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో చదివే విద్యార్థులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ రాజయ్య, ఇతర అధికారులు సిబ్బందితో కలిసి పాఠశాలలో మంచినీటి సౌకర్యం కల్పించినట్లు స్థానిక వార్డు కౌన్సిలర్ అల్లూరి పావని తెలిపారు. ఐదవ వార్డ్ కౌన్సిలర్ వెంకటేష్, మరో కౌన్సిలర్ నరసింహాతో కలిసి ప్రభుత్వ



పాఠశాలలో మంచినీటి సౌకర్యం సంబంధించిన పనులు పూర్తి చేసినట్లు వివరించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య వచ్చినా మంత్రి వాకటి శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకొని, వాటిని పరిష్కరిస్తూ వచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అల్లూరి రవి కుమార్, మార్కెట్ డైరెక్టర్ శాలం, కో ఆప్షన్ మెంబర్ వల్లంపల్లి లక్ష్మణ్, గుంతలి శివ కుమార్, పాఠశాల సిబ్బంది ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత - సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలి

**- వనపర్తి మండలంలో సర్ ప్రక్రియను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు**



**వనపర్తి రూరల్, జూలై 03, (జనంసాక్షి):** ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి ఓటరు తన ఓటును పరిరక్షించుకోవాల్సిన బాధ్యతను గుర్తించి సర్ (ఓటరు జాబితా సవరణ) ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. వనపర్తి మండలంలోని అప్పాయిపల్లి గ్రామం, గుంత తండా, కీర్య తండా ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్ ప్రక్రియను మండల పార్టీ అధ్యక్షుడు కె. మాణిక్యం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి ఓటరు జాబితా సవరణ పనులు పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేలా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “మన ఓటు... మన బాధ్యత” అనే భావనతో ప్రతి ఓటరును ప్రత్యక్షంగా కలిసి సర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ విజయవంతం కావడానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా సహకరిస్తుందని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ధర్మ నాయక్, అప్పాయిపల్లి గ్రామ సర్పంచ్ పద్మా విష్ణు యాదవ్, గుంత తండా సర్పంచ్ శంకర్ నాయక్, కీర్య తండా సర్పంచ్ కిష్ట నాయక్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధరూర్ మండలంలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా : పట్టించుకోని అధికారులు!

**- జాంపల్లి నెట్టెంపాడు కాలువ మట్టి యథేచ్ఛగా తరలింపు -కాలువ గట్లకు పొంచి ఉన్న ప్రమాదం**



**దరూరు, జూలై 3(జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం జాంపల్లి గ్రామ పరిధిలో మట్టి మాఫియా పగలు, రాత్రి తేడా లేకుండా రెచ్చిపోతోంది. నెట్టెంపాడు ప్రాజెక్టు కాలువకు సంబంధించిన ప్రభుత్వ మట్టిని కొందరు అక్రమార్కులు జేసీబీలు, టిప్పర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాలువ రక్షణ కోసం నిర్మించిన గట్లను కూడా తవ్వేస్తుండటంతో, భవిష్యత్తులో కాలువ తెగిపోయే ప్రమాదం ఉందని స్థానిక రైతులు భయపడుతున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, ఇరిగేషన్, మరియు రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ రవాణాను అడ్డుకోవాలని, వాహనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## సంక్షేమపథకాలు, శుభకార్యాల్లో పాల్గొన్న కాంగ్రెస్ ప్రతినిధులు



**నారాయణపేట, జూలై 4(జనంసాక్షి):** నారాయణ పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల శుక్రవారం మేరకు కాంగ్రెస్పార్టీప్రతినిధులు, నాయకులు సంక్షేమపథకాలు,శుభకార్యాల్లో పాల్గొన్నారు.నారాయణ పేట మండలం లో పలు శుభాకార్యంలో పాల్గొన్న మన జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి,ఎమ్మెల్యే ముఖ్య సహాయకులు చిట్టెం మాధవరెడ్డి, పెరపల్ల మాజీ ఎంపీటీసీ శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయ శరణప్ప, లక్ష్మీ పూర్ సర్పంచ్ మమత ,ఎక్లస్పూర్ లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం లో గ్రామ సర్పంచ్ శేఖర్ గౌడ్, తారక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఉషాప్ప,అనంతరం జాజాపూర్ రైతు వేదిక లో ప్రభుత్వం నుండి వచ్చిన పత్తి విత్తనాలు పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచ్ ఉపసర్పంచ్ లు వార్డ్ మెంబెర్స్ గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీరంగూడ గుట్టపై 5,200 మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టిన వెల్స్ ఫార్గో

**- పర్యావరణ పరిరక్షణలో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం అభినందనీయం : ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్**



**అమీన్పూర్, జూలై 3 (జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా ప్రముఖ సంస్థ వెల్స్ ఫార్గో (జెవశ్రీశ్రీం ఖీఱతీస్త్రశీ) బీరంగూడ గుట్టలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం ప్రాంగణంలో 5,200 మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో వివిధ రకాల మొక్కలను నాటారు. ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, కార్యనిర్వహణ అధికారి దేవనాదం సమక్షంలో సంస్థ ప్రతినిధులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ నిబద్ధతను చాటుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ ఆలయ ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపేందుకు 5,200 మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చిన వెల్స్ ఫార్గో సంస్థకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో కార్పొరేట్ సంస్థలు భాగస్వాములు కావడం సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, అవి పెద్ద వృక్షాలుగా ఎదిగేలా దేవాలయం నుంచి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రకృతిని కాపాడేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని, ఇతర సంస్థలు కూడా సామాజిక బాధ్యతలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సభ్యులు, ఆలయ అర్చకులు, ఎండోమెంట్స్ శాఖ అధికారులు, వెల్స్ ఫార్గో సంస్థ ప్రతినిధులు, ప్రకృతి ప్రేమికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఆలయ పరిసరాలను హరితవనంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.

# పేదోడి కంటి వెలుగుల్లో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**- సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు**

**- వేలాది మందికి పరీక్షలు -- వందలాది మందికి ఉచిత శస్త్రచికిత్సలు, కంటి అద్దాలు**



కల్వకుర్తి,జూలై 3,(జనంసాక్షి):సేవ చేయాలనే సంకల్పం ఉంటే సమాజంలో ఎన్నో మార్పులు తీసుకురావచ్చని నిరూపిస్తున్న వ్యక్తి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి. పేద ప్రజల ఆరోగ్యమే తన ధ్యేయమనే లక్ష్యంతో ఆయన చేపడుతున్న ఉచిత కంటి వైద్య శిబిరాలు కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు వరప్రసాదంగా మారాయి.కంటి సమస్యలతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్స పొందలేని నిరుపేదలకు ఆయన అందిస్తున్న సేవలు వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయి.

ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో, శంకర నేత్రాలయ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలు నియోజకవర్గంలో విశేష స్పందన పొందుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కంటి వ్యాధులను నిర్లక్ష్యం చేయడం వల్ల అనేక మంది చూపును కోల్పోతున్న పరిస్థితులను గుర్తించిన రాఘవేందర్ రెడ్డి, ప్రతి పేదవాడికి నాణ్యమైన కంటి వైద్యం అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో సంపూర్ణ అంధత్వ నిర్మూలనే తమ లక్ష్యమని ఆయన ప్రకటించారు.ఇటీవల నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. మొదటి రోజే 800 మందికి పైగా నమోదు చేసుకోగా, వందలాది మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శుక్లాల సమస్యతో బాధపడుతున్న పలువురిని ఉచిత శస్త్రచికిత్సలకు ఎంపిక చేయడంతో పాటు వందల సంఖ్యలో కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు.రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాలు వేలాది మందికి ప్రయోజనం చేకూర్చాయి. 2024లో వెల్దండ ప్రాంతంలో నిర్వహించిన శిబిరంలో 1,755 మందికి పరీక్షలు నిర్వహించి, 122 మందికి ఉచిత శుక్లాల శస్త్రచికిత్సలు చేశారు. అలాగే 2025లో కల్వకుర్తి ప్రాంతంలో నిర్వహించిన శిబిరంలో 1,151 మందికి పరీక్షలు నిర్వహించి, 153 మందికి ఉచిత శస్త్రచికిత్సలు అందించారు. అదే సంవత్సరం మద్దుల ప్రాంతంలో నిర్వహించిన శిబిరంలో 784 మందికి పరీక్షలు చేసి, 143 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. వైద్య పరీక్షలతో పాటు మందులు, కంటి అద్దాలు, శస్త్రచికిత్సలు, రవాణా సౌకర్యాలు వంటి సేవలను కూడా ఉచితంగా అందించడం విశేషం.సామాజిక సేవలో ఎప్పుడూ ముందుండే రాఘవేందర్ రెడ్డి కేవలం ఆరోగ్య రంగానికే పరిమితం కాకుండా యువత ఉపాధి, విద్య, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రజా సేవే పరమావధిగా ముందుకు సాగుతున్న ఆయన, ప్రతి గ్రామానికి వైద్య సేవలు చేరాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తున్నారు.

నేటి కాలంలో వైద్య సేవలు సామాన్యుడికి భారంగా మారుతున్న తరుణంలో, పేదలకు ఉచితంగా చూపును ప్రసాదించే ఈ కార్యక్రమాలు నిజమైన మానవతా సేవకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎన్నో కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతూ,వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేరు కల్వకుర్తి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.”చూపు కోల్పోయిన వారికి వెలుగు... ఆశ కోల్పోయిన వారికి భరోసా... పేదోడి కంటి వెలుగుల్లో నేడు మెరిసిపోతున్న పేరు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి.”

# ఎస్ఐఆర్ సమావేశంలో బీఎల్‌వోల గోడు

**- పనిభారం తగ్గించాలని విజ్ఞప్తి**



**తెలకపల్లి, జూలై 03, (జనంసాక్షి):** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పెరుగుతున్న పనిభారం, ఓటర్ల సహకారం లేకపోవడంతో విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఓటర్ల నుంచి ఆశించిన స్థాయిలో సహకారం అందడం లేదని, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణతో పాటు ఎస్ఐఆర్ విధులను కూడా నిర్వర్తించాల్సి రావడంతో అదనపు భారం పడుతోందని తెలిపారు. అయినప్పటికీ ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేస్తూ తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని పేర్కొన్నారు. బీఎల్‌వోల సమస్యలపై స్పందించిన తహసీల్దార్ విజయకుమార్, ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌వోల పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అనంతరం జీపీవోల ద్వారా మొబైల్ ఫోన్ ఆపరేటింగ్ విధానం, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై బీఎల్‌వోలకు శిక్షణ, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ పరిజ్ఞానం - అనర్గల వాక్చాతుర్యం

**- రాష్ట్రస్థాయి ఆదర్శ ఐక్యరాజ్యసమితి కార్యక్రమంలో 9 మంది మెదక్ విద్యార్థుల ఉత్తమ ప్రతిభ**

**- అదనపు కలెక్టర్ నగేష్**

**మెదక్ బ్యూరో చీఫ్, జులై 3 (జనంసాక్షి):** రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలకు మొదటి సారిగా నిర్వహించిన ఆదర్శ ఐక్యరాజ్యసమితి కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన తొమ్మిది మంది విద్యార్థులను జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అభినందించారు.

ఇలాంటి కార్యక్రమాల వలన విద్యార్థులలో నాయకత్వ పటిమను వెలికి తీసేందుకు, అంతర్జాతీయ పరిజ్ఞానాన్ని కలిగించేందుకు ఇవి ఎంత గానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులలో భావవ్యక్తీకరణ నైపుణ్యం వెల్లి విరవాలంటే ఇలాంటి కార్యక్రమాలతో పాటు మాదిరి పార్లమెంట్ వంటి కార్యక్రమాలను మండల, జిల్లా స్థాయిలో కూడా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి రాజు సోషల్ ఫోరం సభ్యులకు సూచించారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన తొమ్మిది మంది విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా వారు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచేందుకు వారిని ప్రోత్సహిస్తూ ముందుండి నడిపించినటువంటి గైడ్ టీచర్లను శాలువాలతో సన్మానించారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఆదర్శ ఐక్యరాజ్యసమితి కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలో పాఠశాల విద్యాశాఖ మరియు తెలంగాణ సాంఘికశాస్త్ర ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాదులోని రాజేంద్రనగర్ టీగ్రిడ్‌లో మే నెలలో నిర్వహించారు. ఈ రాష్ట్రస్థాయి సమావేశానికి మొత్తం తెలంగాణ రాష్ట్రంలోని 23 జిల్లాల నుండి ప్రతి జిల్లాకు పది మంది వివిధ దేశాల ప్రతినిధులుగా ఒకరు అంతర్జాతీయ ప్రెస్ మండలి సభ్యులుగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ మొత్తం మంది విద్యార్థులను ఐదు కమిటీలుగా ఏర్పాటు చేయడం జరిగింది. మెదక్ జిల్లాకు ఐక్యరాజ్యసమితి బాలల నిధి అనే కమిటీలో దోపిడీ, అక్రమ రవాణా, కార్మిక దోపిడీలను నివారించడానికి మరియు ప్రతిస్పందించడానికి బాలల రక్షణ చట్టాన్ని మెరుగుపరచడం అనే అంశాన్ని కేటాయించడం జరిగింది. ఈ అంశంలో నాలుగు విభాగాలలో 10 ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు కేటాయించడం జరిగింది. అందులో 8 మంది విద్యార్థులు మెదక్ జిల్లాకు చెందిన వారే విశేషం.ఈ అంశంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముస్లాపూర్ అల్లాదుర్గుకు చెందిన పల్లె పూజ శ్రీ టర్కీ దేశ ప్రతినిధిగా వ్యవహరించి ఉత్తమ డెలికేట్ అవార్డును పొందడం జరిగింది. అదేవిధంగా రెండు హై కమండెషన్ అవార్డులలో రెండూ మెదక్ జిల్లా విద్యార్థులకే దక్కటం అభినందనీయం అందులో శంకరంపేట ఆర్ మోడల్ స్కూల్ కు చెందిన బి అభిజ్ఞ ఎమన్ దేశానికి ప్రతినిధిగా, నర్సాపూర్ జక్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థి ఎల్ వనిశిక థాయిలాండ్ దేశానికి ప్రతినిధిగా వ్యవహరించి ఈ అవార్డులను పొందారు. స్పెషల్ మెన్షన్ అవార్డుల్లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూచన్ పల్లి హవేలీ ఘన్పూర్ మండలానికి చెందిన కే అభినయ వియత్నాం ప్రతినిధిగా వ్యవహరించి ఈ అవార్డును గెలుచుకున్నారు. అదేవిధంగా హానరబుల్ మెన్షన్ లో భాగంగా ఐదు అవార్డులలో నాలుగు మెదక్ జిల్లాకే దక్కాయి. నర్సాపూర్ జక్కపల్లి మోడల్ స్కూల్ కు చెందిన ఆర్సియా ఫాతిమా ఉగాండాకు ప్రతినిధిగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాళ్ళకల్ మనోహరాబాద్ మండలానికి చెందిన పావులే ఐశ్వర్య యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా కు ప్రతినిధిగా , యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కు ప్రతినిధిగా సమీక్ష , టి జి ఆర్ ఎస్ గర్ల్స్ మెదక్, వార్డు నెంబర్ వన్ గాంధీనగర్ కు చెందిన తోవల్లి జయశ్రీ యునైటెడ్ కింగ్డమ్ ప్రతినిధిగా వ్యవహరించి ఈ అవార్డులను పొందారు. అదేవిధంగా అంతర్జాతీయ ప్రెస్ లో స్పెషల్ మెన్షన్ అవార్డులో భాగంగా శంకరంపేట ఆర్ మాడల్ స్కూలుకు చెందిన చైతన్య తేజ కు ఈ అవార్డు దక్కింది. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనం మూర్తి, సాంఘిక శాస్త్ర జిల్లా ఫోరం అధ్యక్షులు తిరునగరి నర్సింలు, సోషల్ ఫోరం రాష్ట్ర బాధ్యులు ఉన్నం రవిబాబు, సోషల్ ఫోరం జిల్లా కోశాధికారి సత్యనారాయణ, గైడ్ టీచర్లు పాల్గొన్నారు



# కొండాపురంలో 'హాకా' రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ డి.కె. అరుణమ్మ

**కేటిదొడ్డి జులై 03 (జనంసాక్షి):** రైతాంగానికి అవసరమైన అన్ని రకాల సేవలు, సదుపాయాలు ఒకే చోట అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న రైతు సేవా కేంద్రాలు ఎంతో అభినందనీయమని మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డి.కె. అరుణ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా, కే.టి.దొడ్డి మండలం పరిధిలోని కొండాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హాకా రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఎంపీ డి.కె. అరుణమ్మ గారు మాట్లాడుతూ.. రైతులకు సాగుకు కావలసిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు వ్యవసాయ సలహాలు ఒకే సూరకూరు కింద దొరికేందుకు ఈ కేంద్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. కొండాపురం మరియు చుట్టుపక్కల ప్రాంతాల రైతులందరూ ఈ హాకా రైతు సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని, తమ వ్యవసాయ రంగాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమానికి విచ్చేసిన మహబూబ్ నగర్ ఎంపీ డి.కె. అరుణమ్మ గారికి స్థానిక నేతలు, రైతులు మరియు గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించి, పూలమాలలతో కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండ్ల వెంకటరాములు, జిల్లా కోశాధికారి మిర్జాపురం రామచంద్రారెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ధరూర్ కిష్టన్న, మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు అనిమిరెడ్డి, కే.టి.దొడ్డి మండల ఓబీసీ ప్రెసిడెంట్ ముంగిలి వీరేష్ రెడ్డి, ఉప సర్పంచ్ భీమ్ రెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు బీజేపీ సీనియర్ నాయకులు రజక నరసింహ, దేవేందర్ రెడ్డి, రఘు గౌడ్, తిమ్మప్ప, సూర్యకాంతరెడ్డి, హనుమంతు, రంగారెడ్డి, కొండాపురం గ్రామ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సార్ ను పగడ్బందీగా నిర్వహించాలి

**- నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసులు**

**అమరచింత, జులై 3 (జనంసాక్షి):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు, శుక్రవారం మండల పరిధిలోని కొంకనువానిపల్లి, పామిరెడ్డిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న సర్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా శనివారం వచ్చి పరిశీలించారు, , ఈ సందర్భంగా ఆయా గ్రామా ల్లో స్పెషల్ ఇన్వెస్టివ్ డివిజన్ ప్రోగ్రాం గురించి బి ఎల్ వో లను అడిగి తెలుసుకున్నారు అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో బిఎల్ఓ లు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఆయన ఆదేశించారు మండలం



లోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న సర్ కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఉండాలని ఆయన ఆదేశించారు, ఓటర్లు తమ ఓటును బాధ్యతగా భావించి ఈ కార్యక్రమానికి వచ్చే అధికారులకు సహకరించాలని ఆయన కోరారు ,ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రవికుమార్ రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు,

# పేదల కంటి వెలుగుల కోసం మెగా వైద్య శిబిరం

**- ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఆహ్వానించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**కల్వకుర్తి,జూలై 3,(జనంసాక్షి):** ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలకొండపల్లిలో జూలై 4 నుంచి నిర్వహించనున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు,టాస్క్ ప్రధాన నిర్వహణాధికారి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఆహ్వానించారు.శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే శిబిర కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించి,ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడే ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మాజీ పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు భూపతి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, యాట నరసింహ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్, సీనియర్ నాయకుడు సురభి వెంకటేశ్వర్ రావు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ స్టవ్‌లపై మధ్యాహ్న భోజన వంట



**మల్దకల్, జులై 3(జనంసాక్షి):** విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన,నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలనే లక్ష్యంతో మల్దకల్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నుంచి గ్యాస్ స్టవ్‌లపై మధ్యాహ్న భోజనం వంట కార్యక్రమం ప్రారంభమైంది. మండల విద్యాధికారి జి.సురేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్యాస్ స్టవ్ లను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రభుత్వ ఆదేశాల మేరకుమండలంలోని అన్ని పాఠశాలలకు అవసరమైన గ్యాస్ సిలిండర్లు,స్టవ్‌లు అందుబాటులో ఉంచి, గ్యాస్‌పై వంట నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.గ్యాస్ వినియోగం ద్వారా పొగ కాలుష్యం తగ్గడంతో పాటు వంట త్వరగా పూర్తవుతుందని, ఆహార నాణ్యత కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు గ్యాస్ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, వంట సిబ్బందికి అవసరమైన సూచనలు ఇవ్వాలని ఆయన సూచించారు. పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నరసింహస్వామి,రాజేశ్వర్ రెడ్డి, వెంకటయ్య ,ఉపాధ్యాయులు, వంట సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రానికి ఆదర్శంగా ఉప్పునుంతల సహకార సంఘం

**- సహకార వారోత్సవాల్లో మేనేజింగ్ డైరెక్టర్ అన్నపూర్ణ ప్రశంసలు**

**- రైతులకు వినూత్న సేవలతో ప్రత్యేక గుర్తింపు**



**ఉప్పునుంతల, జూలై 3 (జనంసాక్షి):** రైతుల సంక్షేమమే లక్ష్యంగా వినూత్న సేవలు అందిస్తూ ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలంగాణ సహకార శాఖ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి అన్నపూర్ణ పేర్కొన్నారు. "సహకారంతో సమృద్ధి సమాజం - సమృద్ధి భారత్" అనే నినాదంతో నిర్వహి స్తున్న సహకార వారోత్సవాల ఐదో రోజు వేడుకలు శుక్రవారం ఉప్పునుంతలలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న 906 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో 311 సంఘాలు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓలు)గా ఎంపికయ్యాయని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన 16 ఎఫ్‌పీఓల్లో ఉప్పునుంతల సహకార సంఘం ప్రథమ స్థానంలో నిలిచి రైతులకు ఆదర్శవంతమైన సేవలు అందిస్తోందని కొనియాడారు.

జిల్లా సహకార అధికారి రఘునాథ్ రావు మాట్లాడుతూ, రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా రైతులకు లభించే ఆర్థిక ప్రయోజనాలు, బిజినెస్ డెవలప్‌మెంట్ ప్లాన్ (బీడీపీ) కింద ఏర్పాటు చేసిన వేరుశెనగ డీకార్టికేటర్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

జాయింట్ రిజిస్ట్రార్ శ్రీమతి పరిమళాదేవి మాట్లాడుతూ, ఉప్పునుంతల సహకార సంఘం అమలు చేస్తున్న వ్యాపార అభివృద్ధి ప్రణాళికను ప్రశంసించారు. సంఘం చైర్మన్, సీఈఓ, సిబ్బంది సమిష్టి కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. రైతులు తమ బ్యాంకు ఖాతాలను ఎఫ్‌పీఓలతో అనుసంధానం చేసుకుంటే రుణాలు, ఈ కార్యక్రమంలో జాయింట్ రిజిస్ట్రార్ శ్రీమతి పరిమళాదేవి, జిల్లా సహకార అధికారి రఘునాథ్ రావు, సూపరింటెండెంట్ మధు రావు, సంఘం చైర్మన్ మడ్డి నరేందర్ రెడ్డి, సీఈఓ రవీందర్ రావు, మాజీ చైర్మన్, మర్రిపల్లి సర్పంచ్ సత్తు భూపాల్ రావు, స్థానిక సర్పంచ్ చింతగల్ల శ్రీనివాస్, డొమైన్ ఎక్స్‌పర్ట్ సృజన్, డొమైన్ ఎక్స్‌పర్ట్ అసిస్టెంట్ రామగిరి తరుణ్ తేజ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్నె లక్ష్మీనారాయణ, సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న బియ్యం సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి

**- రాష్ట్రప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్నబియ్యం సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహనా కల్పించాలి**
**- కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**



**సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లాలో రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్నబియ్యం సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 36 శాతం అదనంగా వరిధాన్యం ప్రొక్యూర్మెంట్ పూర్తవడం పట్ల జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. రాష్ట్రంలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతులను ఇబ్బందులకు గురిచేసే విధంగా ఎవరూ వ్యవహరించరాదని స్పష్టం చేశారు.జిల్లాలో ఇప్పటివరకు 6,351 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం మాత్రమే కొనుగోలు జరిగిందని పేర్కొంటూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సన్నబియ్యం సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, రైతులకు అవసరమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు.

వ్యవసాయ అవసరాలకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్రంలో పెంకుటిళ్లు లేకుండా పక్కా ఇళ్లు ఉండేలన్నది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, జిల్లాలోని అన్ని పెంకుటిళ్లను గుర్తించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అధికారులు మంచి పురోగతి సాధిస్తున్నారని అభినందిస్తూ, పేదల సొంతింటి కలను సాకారం చేసేలా మరింత కృషి చేయాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అసంపూర్తి మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.బస్తీ దవాఖానల్లో వైద్యుల కొరత ఉంటే వెంటనే నియామక ప్రక్రియ చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని మంత్రి ఆదేశించారు. చిన్నచిన్న మరమ్మతు పనులను కూడా ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సూచించారు.


టామ్ కామ్ సంస్థ ద్వారా నిరుద్యోగులకు విదేశాలలో ఉద్యోగాలు కల్పించేందుకు ఆయా దేశాల స్థానిక భాషలపై శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లాలో యువత ఈ కార్యక్రమంలో పాల్గొనేలా జిల్లాలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు.మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు మాట్లాడుతూ జిల్లాలో 5.17 లక్షల ఎకరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని, డ్రోన్ల ద్వారా ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన భూసమస్యలను పరిష్కరించాలని, మర్కుక్--పాములపర్తి రహదారిపై డివైడర్ లైట్లు ఏర్పాటు చేయాలని, మల్లన్నసాగర్ నిర్వాసితులకు పెండింగ్ పరిహారం త్వరగా అందించాలని కోరారు. సోలార్ పంప్‌సెట్ల ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహించబడేలా చర్యలు తీసుకోవాలని, దుబ్బాకలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. నామాపూర్ గ్రామంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కార్యక్రమం ద్వారా ఇండ్లపై సోలార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు

జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ జిల్లాలో యూరియా సరఫరా సమృద్ధిగా ఉందని జిల్లాకు 45 వేల మెటీరియల్ ఏరియా అవసరం కాగా ఇప్పటికే జిల్లాలో 10,000 మెట్రిక్ టన్నుల ఏరియా స్టాక్ ఉందని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, యూరియా యాప్ ద్వారా ప్రతి రైతుకు అవసరమైన యూరియా అందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పంటల నష్టం నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, టూ బీహెచ్‌కే ఇళ్ల పెండింగ్ పనులను వేగవంతం చేసి, అనర్హులను తొలగించి అర్హులకు ఇళ్లు కేటాయిస్తామని చెప్పారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ, రైతులకు డ్రిప్ ఇరిగేషన్ సదుపాయాలు, యూరియా సకాలంలో అందేలా చూడాలని కోరారు. వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, జనుము, జిలుగు విత్తనాల కొరత లేకుండా చూడాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల పెండింగ్ తొలగించాలని, సీజనల్ వ్యాధులపై ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాలో సి-సెక్షన్‌ల సంఖ్య తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని, బస్తీ దవాఖానల్లో వైద్యులను నియమించాలని, పశువులకు అవసరమైన మందులు సకాలంలో అందించాలని, సిద్దిపేట సిరిసిల్ల వెళ్లే రైల్వే లైన్ మధ్యలో గల మూడు కెనాల్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఏమ్మెల్సీ మల్కా కొమరయ్య మాట్లాడుతూ వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ పథకాన్ని ఉపయోగించాలని, డిఇఓ ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ పెంచాలని అన్నారు.

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, సన్నబియ్యం సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, భూసార పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కెనాల్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, వైర్ల సమస్యలను పరిష్కరించి, అసంపూర్తి రహదారి పనులను పూర్తి చేయాలని కోరారు.ఎంఎల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలని, జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటు విస్తరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు వంటేరు యాదవరెడ్డి, దేశిపతి శ్రీనివాస్, మల్క కొమరయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ ఆసుపత్రుల్లో పేదలపై దోపిడీ? వైద్య సేవల పేరిట భారీ బిల్లుల భారం

**- రోగులను ఆకర్షించడానికి ప్రెస్ మీట్**
**- పిఆర్ఓ ద్వారా సొమ్ము చేసుకుంటున్నా ౦ కార్పోరేట్ ఆసుపత్రులు**
**- అమాయక ప్రజలకు ఎరా వేస్తున్న పిఆర్వోలు**




**వనపర్తి రూరల్, జూలై 02, (జనంసాక్షి):** అత్యాధునిక వైద్య సేవల పేరుతో కొంతమంది కార్పొరేట్ ఆసుపత్రులు పేద, మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవసరం లేని పరీక్షలు, ఖరీదైన మందులు, అనవసర శస్త్రచికిత్సలు సూచించడం, ప్రభుత్వ ఆరోగ్య పథకాల లబ్ధిదారులకు కూడా అదనపు చార్జీలు విధించడం వంటి ఫిర్యాదులు వెలుగులోకి వస్తున్నాయని పలువురు రోగులు చెబుతున్నారు. బాధితుల కథనం ప్రకారం, అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి చేరుకున్న వెంటనే భారీ మొత్తంలో అడ్వాన్స్ చెల్లించాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపిస్తున్నారు. చికిత్స పూర్తయ్యే సమయానికి లక్షల్లో బిల్లులు చూపించి, పూర్తి చెల్లింపు వరకు డిశ్చార్జ్ ఆలస్యం చేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయని వారు పేర్కొంటున్నారు.

ఆరోగ్య హక్కుల కోసం పనిచేస్తున్న సామాజిక కార్యకర్తలు మాట్లాడుతూ, వైద్య సేవల్లో పారదర్శకత లేకపోవడం వల్ల రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంటున్నారు. చికిత్సకు ముందు ఖర్చుల అంచనా, అవసరమైన పరీక్షల వివరాలు, మందుల ఎంపిక వంటి అంశాలను రోగులకు స్పష్టంగా తెలియజేయాలని వారు సూచిస్తున్నారు. జిల్లా కేంద్రాలలో కార్పొరేట్ ఆసుపత్రుల నుండి పిఆర్వోలను నియమిస్తూ సామాన్య ప్రజానీకానికి ఏరవేస్తూరని,ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ, సంబంధిత నియంత్రణ సంస్థలు ఆసుపత్రుల బిల్లింగ్ విధానాలు, వైద్య సేవల నాణ్యత, ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలుపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేస్తున్నారు.

## చేనేత సొసైటీ అధ్యక్షుల ఎంపిక

**నారాయణపేట జూలై 3(జనంసాక్షి):** నారాయణపేట మండలం చిన్న జట్రం, కోటకొండ హ్యాండ్లూమ్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవముగా జరిగాయి. ఆయా గ్రామాల అధ్యక్షులుగా జున్ను ఆంజనెయులు, శ్రీనివాసులు ఉపాధ్యక్షులుగా కెంచే నారాయణ, కార్యదర్శి గా యంగలి రఘురాములు, కోశాధికారిగా సాక బాలప్ప, సభ్యులుగా పగుడాకుల రాములు, ఎర్పుల వెంకట్రా ములు, బోగం రాములు, కొంగరి మణెమ్మ,సంగ రమేశ్వరమ్మ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా చిన్న జట్రం ఉపాధ్యక్షులుగా కంచె రాములు కోశాధికారిగా కించె భాస్కర్ ప్రధాన కార్యదర్శిగా భోగం హరికృష్ణ వారితో పటు సభ్యులను ఎన్నుకున్నారు.



ఈ సందర్భముగా నూతనంగా ఎన్నికయిన అధ్యక్షులు మాట్లాడుతూ చేనేత పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు ఉందని దానిని కాపాడుకోవడం మన బాధ్యత అని చేనేత కార్మికులు సమస్యలు పరుస్కారం కొరకు నిరంతరం వారి మధ్యన ఉంటూ పనిచేస్తానని తెలిపారు.

## కాల్వ పూడిక తీత పనులను ప్రారంభించిన వాకిటి శేషగిరి

**మక్తల్, జూలై 03 (జనంసాక్షి):** మక్తల్ మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో దోశీగుల ఆంజనేయస్వామి దేవాలయం దారి నుంచి మురుగునీటి కాలువలో మట్టి పిచ్చి మొక్కల తో నిండి చిన్నపాటి వర్షానికి కాలువలోని మురుగు నీరు పంట పొలాల్లోకి ఆలయం ముందు వచ్చి చేరుతుండడంతో రైతులకు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సోదరుడు మాజీ ఉపసర్పంచ్ వాకిటి శేషగిరి తెలిపారు. వెంటనే స్పందించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఇటాచి సహాయంతో కాలువ పూడికతీత పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 4 వ వార్డ్ కౌన్సిలర్ పికే నరసింహ, 5 వార్డ్ కౌన్సిలర్ పెయింటర్ వెంకటేష్, ఆయకట్టు మాజీ ప్రెసిడెంట్ మామిళ్ళ కిష్టప్ప, మాజీ కౌన్సిలర్లు నిప్పురవ్వ, తిరుపతి వెంకటేష్, కత్తిరి నాగరాజ్, రాజేందర్, తిరుపతి నర్సింలు, లింగం, ఈసరి అంజి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

**మల్దకల్ జులై 3(జనంసాక్షి):** మండలం పరిధిలోని పెద్దపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. మల్దకల్ మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన సంధ్య, రాఘవేంద్రకు మంజూరైననూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. గద్వాల నియోజకవర్గంలో మొదటి విడతలో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగినది.దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలుచేయాలన్నారు.ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి కి గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, సింగల్ విండో ఛైర్మెన్ తిమ్మారెడ్డి,జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎంపీపీలు రాజారెడ్డి,విజయ్, సర్పంచులు తూమ్ కృష్ణారెడ్డి, వినోద్,నాయకులు అజయ్, సీతారాంరెడ్డి, వెంకటన్న, నరసింహారెడ్డి,వెంకటేశ్వర్ రెడ్డి,నాయకి మధు,నారాయణ, ఆంజనేయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.